జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 | సంపుటి: 18 | సంచిక: 346 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

విశ్వావసు నామ సంవత్సరం , మాఘ మాసము , ఉత్తరాయణము , శిశిర రుతువు, సూర్యోదయం : 06:40 AM , సూర్యాస్తమయం : 06:26 PM. దిన ఆనందాది యోగము : అమృత యోగము, ఫలితము: కార్యసిద్ధి , నూతన ఆభరణ వస్త్ర లాభము

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి

**8మంది ఇంజనీర్లను సస్పెండ్ చేస్తే ఉత్తర్వులు**

**తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం**

హైదరాబాద్,ఫిబ్రవరి19(ప్రజాజ్యోతి): దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి ఆరోపణలపై

మిగతా1 2లో..

## ఉచిత బస్ ప్రయాణం కోసం మహాలక్ష్మి కార్డులు!

**జూన్ 2 నుంచి అమల్లోకి కొత్త విధానం!**

హైదరాబాద్,ఫిబ్రవరి 19(ప్రజాజ్యోతి): తెలంగాణలో మహిళా సాధికారితే ధ్యేయంగా అమలవుతున్న మహాలక్ష్మి పథకం మరో కీలక మైలురాయికి చేరుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2లో..



# డిజిటల్ రంగంలో భారత్‌లో విప్లవాత్మక మార్పులు

- కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల వెల్లడి
- విశాఖ మీదుగా ఐఐటి ఖరగ్‌పూర్‌కు వెళ్లేవాడిని
- అదే విశాఖలో ఇప్పుడు గూగుల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం
- ఏఐ సదస్సులో గూగుల్ సీఇవో సుందర్ పిచాయ్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ప్రజాజ్యోతి): డిజిటల్ రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోందని, ఏఐ కేంద్రంగా మారుతోందని పలుదేశాల ప్రతినిధులు ప్రశంసించారు. ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ మేధ సదస్సుకు భారత్ వేదికైంది. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతోన్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమిట్'లో 118 దేశాలు పాల్గొన్నాయి. గురువారం జరిగిన సదస్సు అధికారిక ప్రారంభ కార్యక్రమంలో పలువురు దేశాధినేతలు, టెక్ దిగ్గజాలు పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కొత్త ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను వృద్ధి పథంలో నడిపిస్తాయి. ఏఐ నిర్మాణం అందరికీ చాలా ఉపయోగంగా ఉంటుంది. భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ మార్పుల వేగం చూసి ఆశ్చర్యపోతున్నా. విద్యార్థిగా ఉన్నప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌కు విశాఖ

మిగతా 2లో..

## మన ఆలోచనలకు అందనంతగా ఏఐ

- మానవ అభివృద్ధిలో ఏఐది కీలక భూమిక
- భారత్‌లో ఏఐ పురోభివృద్ధి చరిత్రగా నిలుస్తుంది
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ప్రజాజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం మన ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ వినియోగం చట్టబద్ధంగా, పునఃసమీక్షించేలా ఉండాలని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' లో గురువారం ప్రధాని ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తోందని ప్రధాని తెలిపారు. మేకిన్ ఇండియా, భారత ఆవిష్కరణ

మిగతా 2లో..

# సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం

- 'ప్రజల తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణ
- సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై సిఎం, మంత్రులకు అభినందన

తెలంగాణ కాంగ్రెస్ నేతల సమావేశంపై ఎక్స్ వేదికగా ఖర్గే వెల్లడి

కాంగ్రెస్ అగ్రనేతలతో రెండుగంటలపాటు సిఎం, మంత్రుల భేటీ

మేడారం జాతర నిర్వహించినందుకు మంత్రి సీతక్కకు ప్రత్యేక అభినందనలు





న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ప్రజాజ్యోతి): సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ప్రజల తెలంగాణ' లక్ష్యాన్ని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, ప్రతి పౌరుడికి న్యాయం అందించడం తమ ప్రధాన సంకల్పమని ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన కీలక సమీక్ష సమావేశం జరిగింది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పా

మిగతా 2లో..

# 26 నుంచి తెలంగాణ.. బడ్జెట్ సమావేశాలు

## తొలిరోజు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం

## 28న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి



హైదరాబాద్, ఫిబ్రవరి 19(ప్రజాజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ బ్జడెట్ సమావేశాల తేదీ ఖరారైంది. ఈనెల 26 నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఫిబ్రవరి 28న అసెంబ్లీలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. సారి సభను 10 నుంచి 15 రోజులపాటు నిర్వహించాలని

మిగతా 12లో..

## వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

**ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతాం**

**అధికారంలోకి రావడం ఖాయం**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్,ఫిబ్రవరి 19(ప్రజాజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు చేశారు. మే నెల మొదటి వారంలో మంచి రోజు చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో 'తెలంగాణ' అనే పదం తప్పనిసరిగా ఉంటుందని కవిత స్పష్టం చేశారు.



ఎన్నికల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తన మొదటి ఛాయిస్ సిద్దిపేట అని, రెండో ఛాయిస్ బోధన్ అని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ ఉండదని, ప్రధాన ప్రతిపక్షంగా తామే అవుతామని కవిత ధీమా వ్యక్తం చేశారు.

మిగతా 12లో..

## హైదరాబాద్‌లో 'లష్కరే తోయిబా' పేలుళ్లకు యత్నం

**చంచల్‌గూడ జైలు నుంచి పాకిస్థాన్‌కు ఫోన్ కాల్స్!**

**ముమ్మర సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు**

హైదరాబాద్, ఫిబ్రవరి 19(ప్రజాజ్యోతి): మూడేళ్ల క్రితం దసరా పండుగ రోజు వరుస పేలుళ్లకు ప్రయత్నాలు చేసి, హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టించేందుకు కుట్రపన్నిన

మిగతా 12లో..

## ఎప్రిల్ నుంచి పలు రాష్ట్రాల్లో ఎన్నికల సవరణ


**సర్ ప్రక్రియపై ఆయా రాష్ట్రాలకు ఈసీ ఆదేశం**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ప్రజాజ్యోతి): దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సవరణ పక్రియపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను

మిగతా 12లో..

# కర్రెగుట్టలో భారీ ఎన్‌కౌంటర్

- మావోయిస్టు అగ్రనేతలు హతం!
- తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ అడవుల్లో కూంబింగ్
- ఆపరేషన్ కగార్-2 చేపట్టిన పోలీసులు
- రెండు వేల మంది బలగాలతో జల్లెడ
- అగ్రనేతలే లక్ష్యంగా భారీ వ్యూహం



హైదరాబాద్,ఫిబ్రవరి 19(ప్రజాజ్యోతి): తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురు కాల్పుల్లో అగ్రనేతలు హతమైనట్టు సమాచారం అందుతోంది. మార్చి 31 నాటికి మావోయిస్టులను పూర్తిగా అంతం చేయాలనే ఆలోచనలో ఉన్న కేంద్ర ప్రభుత్వం ఆ దిశగానే చర్యలు వేగవంతం చేసింది. టార్గెట్‌కు ఇంకా నలభై రోజులే గడువు ఉన్నందున ఆపరేషన్ కగార్‌ను ముమ్మరం చేసింది. కర్రెగుట్టలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారనే సమాచారం అందుకున్న

మిగతా 12లో..

# ప్రజాతీర్పును కాలరాస్తున్న కాంగ్రెస్

- పోస్టింగ్‌ల కోసం పోలీసుల తొత్తు వ్యవహారాలు
- క్యాతన్‌పల్లిలో బలమున్నా మంత్రి వివేక్ దుర్మార్గం
- వచ్చేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే.. అప్పుడు చూపిస్తాం
- మీడియాతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు
- జైలులో బాల్క సుమన్‌కు హరీష్ రావు పరామర్శ



ఆదిలాబాద్,ఫిబ్రవరి19(ప్రజాజ్యోతి): ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతుందని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ అడుగులకు మడుగులు ఒత్తుతున్న పోలీసుల అధికారులపై

మిగతా 2లో..

# సంపాదకీయం

## దూసుకు వస్తున్న ఎఐ..దిఅప్రమత్తతే ముఖ్యం!

ఎఐ దుష్ఫలితాలను చర్చించడం ద్వారా యువత భవిష్యత్ గురించి ఇప్పుడు ప్రపంచం ఆలోచించాలి. ఎఐతో పెనుముప్పు తప్పదని ప్రఖ్యాత కంపెనీలు, నిపుణులు హెచ్చరిస్తున్న వేళ దీనిపై ప్రధానంగా చర్చించాలి. ఎందుకంటే నిరుద్యోగాన్ఇన ఇది పెంచి పోషించడం ఖాయమని అంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా-ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సందర్భంగా ప్రధానంగా దుష్ఫలితాలను చర్చించాలి. ఉద్యోగావకాశాలు పోతాయని అంటున్నప్పుడు దాని ప్రభావంతో జరిగే నష్టాన్ని చర్చించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తి స్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాల మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, ఎలాంటి ముప్పు ఏర్పడబోతుందో అన్నది ప్రధానంగా ఎఐ సమ్మిట్‌లో చర్చిస్తే మంచిది. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో నిపుణులతో కమిటీ వేసి చర్చించి, ఉపద్రవానికి ముందే చర్యలకు పూనుకోవాలి. ఢిల్లీ వేదికగా అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఈ మేరకు ప్రకటన రావాల్సి ఉంది.

భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలేంటన్నది చర్చకు రావాలి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశర చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే ఉన్నాం. అనేకమంది మేధావులు మనచెంత ఉన్నారు. ఎఐ కి సంబంధించిన అనేక విషయాలను అంతర్జాతీయంగా గుర్తించిన నిపుణులు మనవాళ్లలో ఉన్నారు. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే అవుతుంది. సవాళ్లను గుర్తించి, అందుకు సమాధానాలను వెతుక్కునే సమయమిది. ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడుతుందని అంటున్నారు. 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాం' అని మోడీ అన్నారు. ఎఐ సదస్సులో ఇదే విషయం చెప్పారు. కొత్త సాంకేతికతను భారత్ ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. ప్రతిభావంతులకు స్వర్గధామంగా భారత్ ఉంది. ఏఐ కేంద్రంగా ఇండియా మారుతోంది. ఏఐ అనేది ఓ పరివర్తన శక్తి. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. ఏఐ అనేది యువత, భారత్‌కు కొత్త విశ్వాసం, ఆస్తిగా ఉంది. తొలినాళ్లలో ఏఐపై అనేక సందేహాలు వచ్చాయి. కానీ ఇప్పుడు ఏఐని యువత ప్రయోజనకరంగా ఉపయోగిస్తోంది. వివిధ రంగాల సమస్యలకు ఏఐ పరిష్కారం చూపుతోందని మోదీ తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో, ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా, చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. మన దేశంలో ఈ రంగ అభివృద్ధి కోసం ఇప్పుడిప్పుడే పరిశోధనలు మొదలయ్యాయి. మరోవైపు ఎఐ వద్ధి పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదం ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను రూపొందించాల్సి ఉంది. దేశంలో ఉన్న యువశక్తిని సమర్థవంతంగా వినియోగిం చుకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్న సాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్ యూనివర్శిటీ నిర్వాకం అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి. అన్నింటికి మించి నిరుద్యోగానికి సవాల్‌గా మారిన ఐఎని ఎలా అధిగమించాలన్న దానిపై ప్రయత్నాలు జరగాలి.

# సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణం

మొదటిపేజీ తరువాయి..

పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్, పార్టీ ప్రస్తుత పరిస్థితులు, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది.సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ మున్సిపల్ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన ఘనవిజయం నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను మల్లికార్జున ఖర్గే తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధించిందని, రాష్ట్ర నాయకులు, మంత్రులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా తదుపరి కార్యాచరణపై చర్చించామని, సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం అనే లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడి ఆకాంక్షలను సాకారం చేస్తూ సమగ్ర తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. సుమారు 2 గంటలపాటు భేటీ కొనసాగింది. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. సీఎం, మంత్రులు, నాయకులతో సమగ్ర సమీక్ష నిర్వహించాం. సామాజిక సంక్షేమం, ఆర్థిక సాధికారత, అందరికీ న్యాయం చేయడంతో పాటు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం అని ఖర్గే పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క-సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క ? సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు. పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

## డిజిటల్ రంగంలో భారత్‌లో విప్లవాత్మక మార్పులు

మొదటిపేజీ తరువాయి..

మీదుగా వెళ్లేవాడిని. అదే విశాఖ తీరంలో ఇప్పుడు గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటవుతోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. డిజిటల్ పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోంది. 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థ కలిగిఉ



రంగంలో భారత్ విప్లవాత్మక మార్పులు సాధిస్తోంది. గతంలో భారత్‌లో బ్యాంకు ఖాతా తెరవాలంటే సమస్యగా ఉండేది. ప్రస్తుతం ఎలాంటి పత్రాలు లేకుండానే బ్యాంకు ఖాతా తెరవగలుగుతున్నారు. ఫోన్‌లోనే బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం వచ్చింది.

140 కోట్ల మంది ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీ తీసుకొచ్చింది. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకు సాగాలి. ప్రతినెలా 20 బిలియన్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. 500 మిలియన్ల మందికి డిజిటల్ హెల్త్ ఐడీలు ఇచ్చారని ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ ప్రశంసించారు. ఏఐ కృత్రిమమైనది కాదు.. వాస్తవమైనదని టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. ఏఐ సదస్సులో ంది. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయి. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని తీర్చిదిద్దుతున్నారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోంది. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోందన్నారు. గత దశాబ్దకాలంగా ఏఐ వేగంగా ముందుకెళ్తోంది. అతి త్వరలోనే మనుషులు చేసే అత్యంత క్లిష్టమైన పనులను ఏఐ మోడళ్లు సులువుగా పూర్తి చేసే రోజులు రానున్నాయి. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు.

## నైజీరియా గనిలో విషయవాయువుల లీక్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి19(ప్రజాజ్యోతి): నైజీరియాలోని ఓ గనిలో విషవాయువులు లీకయ్యాయి. ఆ విష వాయువులను పీల్చి 37 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఓ గనిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుందని అక్కడి పోలీస్ అధికారులు వెల్లడించారు. నార్త్ సెంట్రల్ నైజీరియాలోని ఎ÷-లాటూ రాష్ట్రంలోని ఓ గనిలో ఆకస్మికంగా లెడ్ ఆక్సైడ్, సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్‌లు లీక్ అయ్యాయి. ఈ వాయువులు మానవాళికి విషపూరితమైనవి. పైగా గనిలో వెంటిలేషన్ కూడా తక్కువగా ఉండడంతో వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఈ విష వాయువులను పీల్చి 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని అధికారులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నైజీరియా సర్కారు ఈ ప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. గనిలో విష వాయువులు లీకవుతాయనే విషయంలో అవగాహన లేకపోవడంతోనే ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అక్కడి మంత్రి చెప్పారు.

## మన ఆలోచనలకు అందనంతగా ఏఐ

మొదటిపేజీ తరువాయి..

సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉందని, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటోందని చెప్పారు. కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని తెలిపారు. భారత్‌లో ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుందన్నారు. కృత్రిమ మేధకు పరివర్తన శక్తి ఉందని ప్రధాని చెప్పారు. దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుందని, అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుందని అన్నారు. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో మనం ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న అని అన్నారు. ప్రజా సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్క్‌లు అని, మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం అవ్వాలని ప్రధాని అన్నారు. కృత్రిమ మేధ మనలను శాసించకూడదని, మనమే ఏఐని శాసించాలని మోదీ చెప్పారు. కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్ అని ఆయన వివరించారు.

## దక్షిణ మండల విద్యుత్ సంస్థలో అవినీతి

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో మొత్తం 8 మంది ఇంజినీర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ విచారణలో అవినీతి ఆరోపణలు నిజమని తేలడంతో ఈ చర్యలు తీసుకుంది. ఈ ఘటన విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రజలకు సేవలందించే కీలక విభాగంలో అవినీతి చోటుచేసుకోవడం ఆందోళనకరంగా మారింది. విద్యుత్ శాఖలో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలపై కొంతకాలంగా అనేక ఫిర్యాదులు అందాయి. మొత్తం 150కు పైగా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో.. విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా అధికారులు పలు ఆధారాలను సేకరించారు. ఫిర్యాదుల్లో పేర్కొన్న అంశాలను పరిశీలించి సంబంధిత ఇంజినీర్ల పాత్రను గుర్తించారు. ఈ విచారణలో అవినీతి జరిగినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. విజిలెన్స్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇంజినీర్లు ఫోన్ పే, గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారా లంచాలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. సాధారణంగా నగదు రూపంలో జరిగే లంచాల స్థానంలో డిజిటల్ చెల్లింపులను ఉపయోగించడం గమనార్హం. సేవలు అందించేందుకు, ఫైళ్లను త్వరగా పరిష్కరించేందుకు, కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు 8 మంది అధికారులు లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డిజిటల్ చెల్లింపుల ద్వారా జరిగిన లావాదేవీలను అధికారులు సాంకేతికంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. సస్పెండ్ అయిన వారిలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు , అసిస్టెంట్ ఇంజినీర్లు, సబ్ ఇంజినీర్లు ఉన్నారు. మొత్తం 8 మంది అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. వారిపై మరింత శాఖాపరమైన విచారణ కూడా చేపట్టే అవకాశం ఉంది. అవినీతి విషయంలో తెలంగాణ సర్కార్ కఠిన వైఖరి అవలంభిస్తోంది. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ శాఖల్లో అవినీతి సహించమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కేసులో మరికొందరి పాత్ర కూడా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది. విద్యుత్ శాఖలో పారదర్శకత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు.

## ఉచిత బస్ ప్రయాణం కోసం మహాలక్ష్మి కార్డులు!


మొదటిపేజీ తరువాయి..

అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యాన్ని మరింత సరళతరం చేస్తూ అధునాతనమైన స్మార్ట్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధమైంది. జూన్ 2 నుంచి ఈ స్మార్ట్ కార్డులను మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఈ నిర్ణయం రాష్ట్రంలోని కోట్లాది మంది మహిళా ప్రయాణికులకు గుర్తింపు కార్డుల ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించడమే కాకుండా, రవాణా వ్యవస్థలో డిజిటల్ విప్లవానికి నాంది పలకనుంది. రాష్ట్ర బడ్జెట్ సన్నాహక సమావేశాల్లో భాగంగా ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బుధవారం సచివాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు.

## ప్రజాతీర్పును కాలరాస్తున్న కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి..

చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, వదిలి పెట్టబోమని హెచ్చరించారు. ఆదిలాబాద్ జైలులో ఉన్న మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ ను గురువారం పరామర్శించారు. అనంతరం జైలు బయట హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. క్యాతనపల్లి మున్సిపల్‌లో 22 స్థానాలకు గాను 14 స్థానాలను బీఆర్ఎస్ గెలిస్తే, ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించకుండా, చైర్మన్ ఎన్నిక రోజు కావాలనే పోలీసు బందోబస్తు లేకుండా చేసి, చైర్మన్ ఎన్నిక జరగకుండా వాయిదా పడేలా చేశారని ఆరోపించారు. అధికారులు, పోలీసుల సమక్షంలో, మంత్రి వివేక్ చూస్తుండగానే దళిత, గిరిజన, మహిళా కౌన్సిలర్లపై దౌర్జన్యంగా, అసభ్యంగా ప్రవర్తించారని విమర్శించారు. బాల్క సుమన్, కోవ లక్ష్మిలను లోపలికి పంపించకుండా కేవలం కాంగ్రెస్ మంత్రిని ఎలా పంపిస్తారని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులపై దాడి చేశారని పేర్కొన్నారు.



బీఆర్ఎస్ నాయకులే దాడులు చేశారంటూ పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి బాల్క సుమన్‌ను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాతన్‌పల్లి, జనగామ, ఇబ్రహీంపట్నం, ఆమనగల్ లో బీఆర్ఎస్ నాయకులను, కౌన్సిలర్లను పోలీసు బలగాలతో భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. జనగామలో ఓటింగ్ కోసం బీఆర్ఎస్ కౌన్సిలర్ చేతి పైకెత్తితే, వెనుక నుంచి కాంగ్రెస్ కౌన్సిలర్లు చేతులు పట్టి లాగి బెదిరించే ప్రయత్నం చేశారని, అందులో దళిత మహిళ చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో తమ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నా ఎన్నికను అడ్డుకునే ప్రయత్నం చేశారని, అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మెజారిటీ ఉన్నా గాని తాము అరాచకానికి పాల్పడలేదని వెల్లడించారు. బాల్క సుమన్‌ను వెంటనే విడుదల చేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం దాడి చేసి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుందో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.మంత్రి వివేక్ వెంకటస్వామి తీరు జుగుప్సాకరంగా ఉందని హరీశ్ విమర్శించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టింగ్‌ల కోసం బీఆర్ఎస్ నేతలను వేధిస్తే ఊరుకునేది లేదని.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తగిన మూల్యం చెల్లించుకుంటారని పోలీసులను మాజీ మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల తిరుగుబాటు మొదలైందన్నారు. 'రాహుల్ గాంధీ.. మీ రాజ్యాంగం ఏమైందో చెప్పాలి' అని డిమాండ్ చేశారు. క్యాతనపల్లి ఇన్సిడెంట్‌పై గవర్నర్ రిపోర్ట్ తెప్పించుకోవాలని హరీశ్ రావు కోరారు. 'వినాశకాలే విపరీత బుద్ధి.. పోలీసులూ తస్మాత్ జాగ్రత్త' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వార్నింగ్ ఇచ్చారు. కాగా, జైల్లో ఉన్న బాల్కసుమన్‌ను హరీశ్ రావుతో పాటు ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, మాజీ మంత్రి రామన్న పరామర్శించారు.


### పబ్లిక్ నోటీసు

దీని ద్వారా ప్రజలకు తెలియ జేయునది ఏమనగా, శ్రీ ఎం. జగదీశ్,అడ్వకేట్ ప్రస్తుత నివాసం హౌస్ నెం. C/B 34, గవర్నమెంట్ క్వార్టర్స్, సి.క్యాంప్, కర్నూలు - గారు, నా క్లయింట్ బోయ నర్సింలు సేనంవల్లిలోని బస్టాండులో కీలకమైన ఆస్తి లింక్ డాక్యుమెంట్ డాక్యుమెంట్ నెంబర్ 1807/1981 పోగొట్టు కున్నట్టు నోటీసులో పేర్కొన్నారు. ప్రభావిత ఆస్తి కర్నూలు జిల్లాలోని కల్లూరు ఉప జిల్లాలోని పందిపాడు గ్రామంలో ఉంది ప్రత్యేకంగా సాయినాథ్ నగర్ లోని ఫ్లాట్ నెం.205, 447 చదరపు గజాలు, సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.13647/2024 ద్వారా కొనుగోలు చేశాడు. ఈ పోయిన పత్రాలు దొరికిన యెడల, ఏమైనా సమాచారం తెలిసిన, సంబంధిత న్యాయవాది ఎం.జగదీష్ ను సంప్రదించగలరు.

సంప్రదించవలసిన వారు:
మొబైల్: 9515756957
ఇమెయిల్: mjagan93@gmail.com
కు తెలుపగలరు.

## శ్రీ రామారావు మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన




**నేరడిగొండ ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** మండలంలోని బొరిగాం గ్రామం ఆధ్యాత్మిక చైతన్యంతో కళకళలాడింది. గ్రామంలో నిర్వహించిన శ్రీ రామారావు మహారాజ్ గురు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. శేఖర్ మహారాజ్ సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాథోడ్ వినేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేద పండితులు యజ్ఞాలు, హోమాలు నిర్వహించారు. హోమగుండం నుంచి వినిపించిన మంత్రోచ్చారణలతో గ్రామం అంతా మార్మోగింది. గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్‌ను భక్తిశ్రద్ధలతో స్మరించుకుని, అనంతరం గ్రామదేవత జగదాంబ దేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులకు భారీగా భోగ బండార (ప్రసాద వితరణ) కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ నాయక్ పవార్ మున్నా, పవార్ చరణ్ సింగ్, ఉప సర్పంచ్ సంగీత, ఎం.పి.టి.సి అభ్యర్థి రాథోడ్ పుల్లాసిన్, రాథోడ్ నాందేవ్, మోహన్ మహారాజ్, పవన్, రవి, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, మండల ప్రముఖులు మరియు భక్తులు పాల్గొన్నారు. భజనలు, ఆధ్యాత్మిక గీతాల నడుమ వేడుకలు ఘనంగా కొనసాగాయి.

## లక్ష్మణ చాందలో ఘనంగా శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**లక్ష్మణ చాంద, ఫిబ్రవరి 19 ప్రజాజ్యోతి :** మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలో గురువారం రోజున శ్రీ శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. నాయకులు మాట్లాడుతు భారత దేశాన మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, మరాఠా వీరుడిగా పేరుగాంచిన భరత మాత ముద్దుబిడ్డ నాయకుడు అంటే ఏంటో చేతల్లో చూపిన ప్రజా సేవకుడిగా, చత్రపతి అని కీర్తింపబడిన శ్రీ శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ యువకులతో పాటు నాయకులు గ్రామ సర్పంచ్ ఓస కవిత రాజు, నిర్మల్ ఏఎంసీ వైస్ ఛైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురకంటి ముత్యం రెడ్డి, ఉప సర్పంచ్ లక్కల వర్ష రవి, బిట్లింగు రజనీకాంత్, గుడ్ల రంజిత్, సంతోష్, శ్రీకాంత్, శ్రీనివాస్, బిక్కునూరి రాజు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్‌ని యువత ఆదర్శం తీసుకోవాలి



**సోన్, ఫిబ్రవరి 19(ప్రజా జ్యోతి) :** సోన్ మండలంలోని వెల్మల్ బొప్పారం గ్రామాలలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ యస్ యస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శ్రీ నర్రా వెంకట శివకుమార్ మాట్లాడుతూ చత్రపతి శివాజీగా ఖ్యాతి పొందిన శివాజీ రాజే భోంస్లే (ఫిబ్రవరి 19, 1627– ఏప్రిల్ 3, 1680) పశ్చిమ భారతదేశాన మరాఠా ప్రాంత రాజ్యం నుండి ప్రారంభించి ""హైంధవీస్వరాజ్"– హిందూసామ్రాజ్యాన్ని నెలకొల్పి ఉత్తరాదిన మొఘల్, దక్షిణాదిన. ఆదిల్షాహీ, నిజాంషాహీ వంటి ముస్లిం రాజ్యాలను మట్టి కరిపించాడు, రాయఘడ్‌లో ఛత్రపతి శివాజీ తండ్రి అయిన షాహాజీ నిజాంషాహీల ప్రతినిధిగా ఉంటూ మొఘల్ రాజులను వ్యతిరేకిస్తూ యుద్ధాల్లో పాల్గొనేవాడు. నిజాంషాహీలపైన షాజహాన్ దండయాత్ర చేసినపుడు షాహాజి సైనికులను బలోపేతం చేయడంలో కీలక పాత్ర వహించాడు. తన ఆదేశాలను ధిక్కరించినందుకు లఖూజీ జాదవ్‌రావ్ అనే మరాఠా యోధుణ్ణి నిజాంషాహీ ప్రభువు హత్య చేయించాడు. ఇది నచ్చని షాహాజీ నిజాంషాహీ ప్రభువు పైన తిరుగుబాటు బావుటా ఎగురవేసి స్వతంత్ర మరాఠా సామ్రాజ్యానికి నాంది పలికాడని ఛత్రపతి శివాజీ మహారాజ్ ని యువత ఆదర్శం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బొప్పారం సర్పంచ్ దేశెట్టి నరేష్, వెల్మల్ సర్పంచ్ రాచకొండ సాగర్, ఉపసర్పంచ్ లు, వార్డ్ సభ్యులు, వీడీసీ సభ్యులు, శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## జైపూర్‌లో బీఆర్ఎస్ శాంతియుత ర్యాలీ

• అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

**జైపూర్, ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి) :** జైపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడాన్ని నిరసిస్తూ ఈ ర్యాలీ చేపట్టారు. ఈ మేరకు మండల అధ్యక్షుడు బల్మూరి అరవిందరావు మాట్లాడుతూ కేసుల నమోదు రాజకీయ కక్షసాధింపేనని ఆరోపించారు. ర్యాలీ అనంతరం నాయకులు డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వినతిపత్రం సమర్పించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకున్న నేపథ్యంలో చైర్మన్ పదవిని దక్కించుకోకుండా కాంగ్రెస్ పార్టీ కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి పోలీసుల సహకారంతో అక్రమ కేసులు నమోదు చేసి నాయకులను జైలుకు పంపించడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. జిల్లా బంద్‌కు ప్రజలు, వ్యాపారస్తులు, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపినట్లు తెలిపారు. జైపూర్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో దుకాణాలు మూసివేసి బంద్ పాటించినట్లు పేర్కొన్నారు. ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్

• వీరత్వానికి పరాక్రమానికి ప్రతీక • శౌర్యం ధర్మ పాలనకు చిహ్నమైన మహనీయుడు



**నిర్మల్, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** భారత జాతి ముద్దుబిడ్డ వీరత్వం, పరాక్రమానికి ప్రతీకగా భావించే ఛత్రపతి శివాజీ మహారాజా జయంతి సందర్భంగా శివాజీ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను తెలుసుకుందాం. భారతదేశ చరిత్రలో గొప్ప యోధులు, సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేర్లలో ఛత్రపతి శివాజీ పేరుకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆయన పేరు ఉంటే హిందూ మతం ఉత్సాహంతో ఉప్పొంగిపోతుంది. చిన్న తనంలోనే మొఘలుల దాడులలో హిందూ మతం అంతరించి పోతుందని వారితో యుద్ధంలో ఓడిపోయి అందరూ చేతులెత్తేసిన వేళ శివాజీ మహారాజు మండే నిప్పు కణికలా దూసుకొచ్చాడు. మొగల్ రాజులతో ఎంతో వీరోచితంగా పోరాడాడు. అందుకే హిందూమతాన్ని కాపాడిన ఘనత ఒక్క మరాఠా మహారాజు శివాజీకే దక్కుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అందుకే ఆ యోధుడి జన్మదినోత్సవాన్ని భారతదేశ వ్యాప్తంగా ఒక వేడుకలా జరుపుకుంటారు. ముఖ్యంగా మహారాష్ట్రలో ఒక పండుగలా నిర్వహిస్తారు. చరిత్రను పరిశీలిస్తే 1674లో శివాజీకి చక్రవర్తిగా పట్టాభిషేకం జరిగింది. అంతటి గొప్ప వీరయోధుడి 394వ జయంతి సందర్భంగా ఆయన పుట్టినప్పటి నుంచి వీర మరణం పొందే వరకు ఎలాంటి విజయాలు సాధించారు. క్రీస్తు శకం 1630లో ఫిబ్రవరి 19వ తేదీన మహారాష్ట్ర పూణే జిల్లాలో ఉన్న జునార్‌లోని శివనీర్ కోటలో జిజియాబాయ్, షహాజీ దంపతులకు శివాజీ జన్మించారు. ఆయన తల్లి క్షత్రియ వంశీయురాలు. శివాజీ పుట్టకముందే పుట్టిన వారంతా చనిపోవడంతో, ఆమె శివపార్వతులను పూజించగా శివాజీ క్షేమంగా ఉన్నాడు. దీంతో ఆయనకు శివాజీ అనే పేరు పెట్టారు. శివాజీ మహారాజ్ కన్న తల్లి దగ్గరే పరమత సహనం, మహిళల పట్ల గౌరవంగా ఉండటం నేర్చుకున్నాడు. అతి చిన్న వయసులోనే తను పుట్టిన భూమికి మేలు చేయాలని, ప్రజలతో ఎలా నడుచుకోవాలో శివాజీకి జిజియబాయి పూస గుచ్చినట్టు వివరించారు. మరోవైపు తన తండ్రి పూణేలో జాగీరుగా ఉండేవారు. తన తండ్రి దగ్గర నుంచి యుద్ధ విద్యలు నేర్చుకున్నాడు. రాజనీతి మెళకువలు నేర్చుకుంటూ తన తండ్రి ఓటముల గురించి అధ్యయనం చేసేవాడు. అప్పుడే సరికొత్త యుద్ధ తంత్రాలను నేర్చుకున్నాడు. శివాజీ 17వ ఏటలోనే కత్తి పట్టాడు. అంతేకాదు వెయ్యి మంది సైన్యంతో వెళ్లి బీజాపూర్‌కు చెందిన తోర్నా కోటను స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత మూడేళ్లలోపే రాజ్‌ఘడ్, కొండన ప్రాంతాలను ఛేజిక్కుంచుకుని పూణే ప్రాంతాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. ఓటమి తప్పదు అనిపిస్తే యుద్ధం నుంచి తప్పుకోవాలి. అనుకూల సమయాన్ని చూసి దాడి చేసి గెలవాలి ఈ సూత్రాన్ని శివాజీ ఎక్కువగా నమ్మేవారట ఇదే శివాజీ పాటించే యుద్ధ తంత్రం దీన్నే గెరిల్లా యుద్ధం అంటారు. శివాజీ మహారాజు ముస్లిముల దురాక్రమణను వ్యతిరేకించినప్పటికీ, తన రాజ్యంలో లౌకికవాదాన్ని పాటించారు. అన్ని మతాల వారినీ సమానంగా ఆదరించారు. ఇతర మతాల వారిని కూడా గౌరవించారు. అంతేకాదు హిందువుగా మారిన ఓ వ్యక్తికి తన కుమార్తెను ఇచ్చి వివాహం కూడా జరిపించారట. ఛత్రపతి శివాజీ స్నేహితుల్లో చాలా మంది మహమ్మదీయులు ఉన్నారు. తన సైనిక వ్యవస్థలో కూడా ఎందరో ముస్లింలకు సముచిత స్థానం కల్పించారు. శివాజీ యుద్ధ తంత్రాలు శత్రువులకు అస్సలు అంతుబట్టని విధంగా ఉండేవట. తిరుగులేని యుద్ధ వ్యూహాలను అనుసరించడమే శివాజీ అసమాన ప్రతిభకు నిదర్శనం. పటిష్టమైన సైన్యంతో పాటు నిఘా వ్యవస్థను కూడా కలిగి ఉండటమే కాకుండా, ఆధునిక యుద్ధ తంత్రాలను ఉపయోగించాడట.

శివాజీ మహారాజ్ పటిష్టమైన నావికా దళం మరాఠాలకు మరింత బలాన్ని పెంచింది. ఇందుకు శివాజీ వేసిన బలమైన పునాదులే కారణం. విదేశీ దండయాత్రల నుంచి కాపాడటానికి అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఆ కాలంలో ఏ రాజులకు ఇలాంటి ఆలోచనలు రాకపోవడం గమనార్హం.

యుద్ధంలో భయంకరమైన అఫ్జల్‌ఖాన్ ముందుగానే శివాజీ యుద్ధ తంత్రాలను, గెరిల్లా యుద్ధం గురించి తెలుసుకుని శివాజీని రెచ్చగొట్టేందుకు, తనకు ఎంతో ఇష్టమైన దుర్గా మాత దేవాలయాన్ని కూలగొట్టాడట. అదే సమయంలో శివాజీ కుట్రలను పసిగట్టి తనను సమావేశానికి ఆహ్వానిస్తాడు. అదే సమయంలో శివాజీ మహారాజ్ ముందుగానే తన ఉక్కు కవచాన్ని వేసుకుని, చేతికి పులి గోర్లు ధరించి అక్కడికి వెళ్తాడు. అందులో శివాజీ, అఫ్జల్ ఖాన్ కేవలం అంగరక్షకులతో మాత్రమే హాలులోకి వెళ్తారు. అక్కడ అఫ్జల్‌ఖాన్ శివాజీని కత్తితో పొడించేందుకు ప్రయత్నించగా తన పులి గోర్లతో శివాజీ అఫ్జల్ ఖాన్‌ను ఖతం చేస్తాడు. అందుకే ఆయనను మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ మహారాజుగా పిలుస్తారు.

## ప్రజల్లో ఫెయిల్ అయిన లీడర్ - పెద్దాయన దగ్గర అట్టర్ ఫ్లాప్



**జైపూర్ ఫిబ్రవరి 18 ప్రజాజ్యోతి :** జైపూర్ మండల రాజకీయాల్లో ఒకప్పుడు హడావుడిగా పేరు వినిపించిన ఓ నాయకుడు ఇప్పుడు ప్రజల్లో పూర్తిగా విఫలమైపోయినట్టు పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తన మాటలతో ఆకట్టుకున్నా, ఆచరణలో మాత్రం జీరోగా మారడంతో ప్రజలు దూరమవుతున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, కేవలం స్వప్రచారానికి పరిమితమైపోయిన ఈ నాయకుడు గ్రామాల సందర్శనలకు కూడా దూరమయ్యాడు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు గాలికొదిలేయడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మాటలు ఎక్కువ పని లేదు అనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

**పెద్దాయన దగ్గర అట్టర్ ఫ్లాప్ :** తనకు మద్దతుగా నిలుస్తారని భావించిన పెద్దాయన వద్ద కూడా ఈ నాయకుడి ప్రభావం తగ్గిపోయినట్టు సమాచారం. మొదట్లో నమ్మకం ఉంచినా, కాలక్రమేణా పనితీరు లోపం, ప్రజల్లో ఆదరణ తగ్గిపోవడం వల్ల పెద్దాయన కూడా నిరాశ వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. పార్టీ కార్యక్రమాల్లోనూ ఈ నాయకుడికి ప్రాధాన్యం తగ్గినట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

**స్వప్రయోజనాల రాజకీయాలే కారణమా? :** ప్రజాసేవ అనే మాటలు పలికినా, వాస్తవంగా వ్యక్తిగత లాభాల కోసమే రాజకీయాలు చేస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర నాయకులను కలుపుకుపోవడంలో విఫలమై, నేనే అన్నీ అనే ధోరణితో ముందుకెళ్లడం వల్ల తన సొంత వర్గంలోనే విభేదాలు తలెత్తాయి. ఫలితంగా కీలక కార్యకర్తలు కూడా దూరమవుతున్నారు.

**భవిష్యత్‌పై అనిశ్చితి :** ప్రజల్లో ఆదరణ కోల్పోయి, పెద్దల వద్ద కూడా నమ్మకం కోల్పోతే రాజకీయ భవిష్యత్ ప్రమాదంలో పడటం సహజం. ఇదే పరిస్థితి కొనసాగితే ఆ నాయకుడి రాజకీయ ప్రయాణం త్వరలోనే ముగిసే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ప్రజాభిమానాన్ని సంపాదించలేని నాయకత్వం ఎంతకాలం నిలబడలేదో ఈ ఉదాహరణ మరోసారి చాటి చెబుతోంది. ప్రజలే బలం అన్న సత్యాన్ని మరచిన నాయకుడికి ఇదే గుణపాఠమని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టు సందర్భంగా ఉద్రిక్తత

– పోలీసుల లాఠీ ఛార్జ్‌లో బీఆర్ఎస్ నాయకుడు సుదర్శన్‌కు గాయాలు



**జైపూర్ ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి :** మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టు నేపథ్యంలో చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల్లో పోలీసుల లాఠీ ఛార్జ్ జరపగా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన సోషల్ మీడియా వారియర్, బీఆర్ఎస్ నాయకుడు జలం పెల్లి సుదర్శన్ కు గాయాలు అయినట్టు తెలిపారు. ఈ లాఠీ ఛార్జ్‌లో సుదర్శన్ తలకు చేతికి గాయాలు కాగా వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలపై పోలీసుల దాడి అన్యాయమని విమర్శించారు. మరోవైపు, పరిస్థితి అదుపు తప్పడంతోనే లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చిందని పోలీసులు వెల్లడించారు.

## సోషల్ మీడియాలో దూషణలు

• కాంగ్రెస్ నాయకుడిపై బీఆర్ఎస్ ఫిర్యాదు
• జైపూర్ పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం సమర్పించిన మండల నేతలు



**జైపూర్, ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి :** జైపూర్ మండల కేంద్రంలో రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ స్థానిక నాయకుడు బీఆర్ఎస్ పార్టీపై, ఆ పార్టీకి చెందిన నేతలపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బలమూరి అరవిందరావుతోపాటు నాయకులు కలిసి పోలీసులను ఆశ్రయించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బుధవారం రోజున మండలానికి చెందిన బీఆర్ఎస్ ప్రముఖులు, కార్యకర్తలు కలిసి జైపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో పోస్టులు పెడుతూ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు, రాజకీయంగా విమర్శలు చేయడం సహజమేనని, కానీ వ్యక్తిగతంగా అవమానించడం, అసభ్య పదజాలం వాడటం సమాజంలో చెడు సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజల మధ్య విభేదాలు రెచ్చగొట్టే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు, సోషల్ మీడియాలో చేసిన పోస్టులపై విచారణ జరిపి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.


## 24 వ డివిజన్ కార్పొరేటర్‌ను కలిసిన తెలంగాణ రజక అభివృద్ధి సంఘం నాయకులు



**మంచిర్యాల, 19, ఫిబ్రవరి (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల పట్టణంలోని 24వ డివిజన్ కార్పొరేటర్ బొడ్డు స్వప్న తిరుపతిని గురువారం మర్యాద పూర్వకంగా తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు, సింగపూర్ గ్రామ కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా సంఘం కార్యకలాపాలు, వృత్తిదారుల సమస్యలు, స్థానిక అభివృద్ధి అంశాలపై స్నేహ పూర్వకంగా చర్చించారు. ఈ సందర్భంగా వృత్తిదారుల సంక్షేమానికి తగిన సహకారం అందిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తంగళ్ళపల్లి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగెపు హనుమంతు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముస్కే చందర్, జిల్లా ఉపాధ్యక్షుడు నడిగోట తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు మామిడి రమేష్, నస్పూర్ మండల అధ్యక్షుడు కొత్తకొండ రామస్వామి, సింగపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండపర్తి రవి, గ్రామ కమిటీ కార్యదర్శి పాయిరాల శంకర్, గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు కొండపర్తి బాపు, పాయిరాల ఇందూర్, పాయిరాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులు ఆందోళన చెందవద్దు

– పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**మంచిర్యాల, 19, ఫిబ్రవరి (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రైతాంగానికి నమస్కారం అని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. గత కొన్ని రోజులుగా పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో రైతులు ఆందోళనలకు లోనవ్వాల్సిన అవసరం లేదని ఎంపీ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, పత్తి కొనుగోళ్లకు సంబంధించి తాను ఇటీవల కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)తో నేరుగా మాట్లాడినట్లు తెలిపారు. రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి, ఈ నెల 20 న కొనుగోళ్లు ఆపకుండా మార్చి 15 వరకు కొనుగోళ్లకు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని అధికారికంగా కోరినట్లు తెలిపారు. ప్రత్యేకంగా చెన్నూర్ నియోజకవర్గంలోని కోటపల్లి ప్రాంతంలో ఫ్యాక్స్ ఫిగర్లు ఆలస్యంగా నమోదు అవుతున్న అంశాన్ని సీఎండీ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఆ ప్రాంత రైతులకు ప్రత్యేకంగా పత్తి కొనుగోళ్లకు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని కూడా విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని సమీక్షించి త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని సీసీఐ అధికారులు హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం తాను నిరంతరం కృషి చేస్తానని, అవసరమైతే ఎక్స్‌టెన్షన్ కోసం మళ్లీ పోరాటం చేస్తానని గడ్డం వంశీకృష్ణ రైతులకు భరోసా ఇచ్చారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు




**నిర్మల్, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని హిందు వాహిని నిర్మల్ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక చింతకుంటవాడ బస్తీలో శివాజీ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర బాధ్యత గల సభ్యులు మర్రిపెద్ది మహేష్, బద్రి సాయి, తేజ, సాయి దేశ్పాండే, ముఖేష్, బస్తీ పెద్దలు హిందు వాహిని కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



## ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**మామడ ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి) :** మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం రోజున పొన్కల్ లోని బస్ స్టాండు దగ్గర శివాజీ విగ్రహానికి పూల మాల వేసి, హనుమాన్ దీక్ష సేవ సమితి, మరియు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వ హిందూ పరిషత్ యువకులు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు శివాజీ మహారాజ్ చేసిన సేవలు ఎనలేనివని తన రాజ్యంలోని ఆడవాళ్ల అందరిని మరియు తన శత్రురాజ్య స్త్రీలను తన తోబుట్టువులుగా భావించి పసుపు, కుంకుమ, చీరలు ఇచ్చేవారని అలాంటి ధీరుడు భరతఖండంలో జన్మించడం మన అదృష్టంగా భావించాలని అన్నారు. దేశంలో అత్యధిక విగ్రహాలు కలిగిన మహారాజు శివాజీ ఒక్కరేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుబాక గంగన్న, నిమ్మతోట బాలరాజు, కొండ్ర రాజ రెడ్డి, సిలివేరి అశోక్, తల్లపెల్లి శేఖర్, ప్రవీణ్, గన్ను మహేందర్, మహేందర్, ద్యాగాల అశోక్, సంజయ్, వినీత్, వినోద్, అఖిల్, అరుణ్, చింటూ, రాము తో పాటు గ్రామంలోని శ్రీ సాయి మోడల్ స్కూల్ విద్యారిని,విద్యార్థులు మరియు గ్రామ విడిసి, యువకులు, గ్రామ ప్రజలు ఉన్నారు.



## సొంతగూటికి చేరిన మాజీ జెడ్పిటిసి గడ్డం భీమ్ రెడ్డి

– మాజీ మంత్రి హరీష్ రావు
– ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో



**నేరడిగొండ ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** నేరడిగొండ మండల మాజీ జెడ్పిటిసి గడ్డం భీమ్ రెడ్డి తిరిగి స్వపక్షంలో చేరారు. వారు దాదాపు 30 సంవత్సరాలుగా నేరడిగొండ మండలంలో మచ్చలేని నాయకులుగా జనంలో పేరు పొందారు. విద్యార్థి దశలో విద్యార్థి నాయకుడిగా తదుపరి కుమారి గ్రామ విద్యా కమిటీ,పిఎసిఎస్ చైర్మన్ గా, జిల్లా పరిషత్ సభ్యులుగా, అగ్రికల్చర్ స్టాండింగ్ కమిటీ మెంబర్గా రైతు సమన్వయ మండల అధ్యక్షులుగా పదవులు నిర్వహించి తనదైన ప్రత్యేకతను పొందారు. నిరంతరం సామాజిక స్పృహ గల నాయకులుగా ప్రజల పక్షం నిలిచారు. మధ్యలో బీజేపీ పార్టీలో చేరిన ఆ పార్టీలో ఉన్న సంస్థ గత నిర్మాణ లోపం తనకు నచ్చలేదని వ్యక్తిగతంగా తనకు ఎవరి మీద ద్వేషం లేదని బిజెపి పార్టీ తెలంగాణలో ఇటు అధికార పార్టీ పాత్ర పోషించడం లేదని అలాగే ప్రతిపక్ష పాత్ర నిర్వహించడం లేదని దీనివల్ల కిందిస్థాయి క్యాడర్లో నిర్వేదం నెలకొందని ఇది భవ్యము కాదని భావించి తిరిగి తాను హరీష్ రావు సమక్షంలో అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో తిరిగి బిఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. తాను నికార్సైన కార్యకర్తగా పనిచేస్తానని అన్నారు. వారి చేరికను మండల కన్వీనర్ శివారెడ్డితో పాటు మండల శ్రేణులు అంత సంతోషం వ్యక్తపరిచి వారిని అభినందించారు.

వారి చేరిక వల్ల నైతికంగా మండలంలో మరింత బలం పెరిగిందని వారు అన్నారు. ఇందులో మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, సబ్లె సంతోష్ సింగ్, అనిల్ యాదవ్,సయ్యద్ జహీర్, గాడ్గే సుభాష్, జాదవ్ గణేష్, మండల నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# డాగ్ స్క్వాడ్‌కు నూతన బలం

- ఎక్స్‌ప్లోసివ్ గుర్తింపు శునకం "సింధు" చేరిక
- ప్రత్యేక శిక్షణతో సిద్ధమైన శునకం... జిల్లా భద్రతా వ్యవస్థకు మరింత బలోపేతం



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి బ్యూరో) :** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ డాగ్ స్క్వాడ్‌కు ప్రత్యేక శిక్షణ పొందిన ఎక్స్‌ప్లోసివ్ గుర్తింపు శునకం "సింధు"ను కేటాయించారు. ఈ సందర్భంగా డాగ్ హ్యాండ్లర్ పీసీ 2752 కిషోర్, జిల్లా ఎస్పీ దరావత్ జానకిను మర్యాదపూర్వకంగా కలిశారు. మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో ఎనిమిది నెలల కఠిన శిక్షణ పూర్తిచేసిన "సింధు" పేలుడు పదార్థాల గుర్తింపులో ప్రత్యేక నైపుణ్యం సాధించింది. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందనతో భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఈ శునకం కీలక పాత్ర పోషించనుంది. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్ఐ అడ్మిన్ కృష్ణయ్య పాల్గొన్నారు. జిల్లా పోలీస్ బలగాల సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా డాగ్ స్క్వాడ్ బలోపేతం అత్యంత అవసరమని అధికారులు పేర్కొన్నారు. "సింధు" చేరికతో జిల్లాలో భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టంగా అమలవుతూ ప్రజల రక్షణలో పోలీస్ శాఖకు అదనపు బలం చేకూరనుందని అధికారులు తెలిపారు.

## కార్పొరేషన్ నూతన నాయకత్వానికి ఘన సన్మానం

### – మేయర్ మమత--డిప్యూటీ మేయర్ ఎంఎస్ఆర్‌కు వినోద్ కుమార్ అభినందనలు



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి బ్యూరో) :** మహబూబ్‌నగర్ కార్పొరేషన్ నూతనంగా ఎన్నికైన మేయర్ గుమల మమత శ్రీనివాస్ మరియు డిప్యూటీ మేయర్ మరేపల్లి సురేందర్ రెడ్డి లను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎస్. వినోద్ కుమార్ గురువారం ఎర్ర సత్యం చౌరస్తా వద్ద వారి స్వగృహానికి ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పారదర్శక పాలన అందించాలని సూచించారు. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో ప్రజలకు దగ్గరగా ఉండి పనిచేయాలని కోరారు. మేయర్ మమత శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఎం ఎస్ ఆర్ మాట్లాడుతూ, ప్రజల సహకారంతో కార్పొరేషన్‌ను ఆదర్శంగా నిలబెట్టే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన మేయర్-డిప్యూటీ మేయర్‌కు ఘన సత్కారం

### – లక్ష్మణ్ యాదవ్, స్వప్న యాదవ్ శాలువాతో సన్మానం



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి బ్యూరో) :** మహబూబ్‌నగర్ కార్పొరేషన్ నూతనంగా ఎన్నికైన మేయర్ గుమల మమత శ్రీనివాస్ మరియు డిప్యూటీ మేయర్ మరేపల్లి సురేందర్ రెడ్డి లను గురువారం సద్దాలగుండు, రాజేంద్రనగర్ ప్రాంతంలో వారి స్వగృహానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మూఢ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, 41వ డివిజన్ మాజీ కౌన్సిలర్ స్వప్న యాదవ్ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు పెట్టిన ఆశలను నెరవేర్చాలని, సమగ్ర అభివృద్ధి దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. మేయర్ మమత శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పారదర్శక పాలన అందిస్తామని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ఎం ఎస్ ఆర్ మాట్లాడుతూ, అన్ని వర్గాల సహకారంతో కార్పొరేషన్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన నాయకత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మేయర్, డిప్యూటీ మేయర్‌కు టీపీసీసీ నేత ఏపి మిథున్ రెడ్డి శుభాకాంక్షలు



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి బ్యూరో) :** మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు నూతనంగా ఎన్నికైన మేయర్ గుమల మమత శ్రీనివాస్ మరియు డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డిని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నగర అభివృద్ధికి ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసి కార్పొరేషన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏపి మిథున్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ పారదర్శకంగా, ప్రజాసేవ దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. మేయర్ గుమల మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి కూడా అభినందనలు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలియజేసి, పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.

## ఇందిరమ్మ గృహాలకు గుడ్‌న్యూస్

### నిలిచిన బిల్లుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి):** వివిధ దశల్లో నిలిచి పోయిన ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఊరట లభించింది. బిల్లుల మంజూరుకు ప్రభుత్వం జి ఓ రఆర్ టి నం.96 జారీ చేసి లబ్ధిదారులకు శుభవార్త అందించింది. బేస్ మెట్ లెవెల్ వరకు అయ్యే ఖర్చును మిన హాయించి, ఆపై ఉన్న నిర్మాణ దశలకు సంబంధించి ఆయా దశలను బట్టి బిల్లులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా వన పర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, బిల్లులు మం జూరు కావడం లేదని భావించి పనులు నిలిపివేసిన లబ్ధిదారులు ఇక నిర్మా ణాలను తిరిగి ప్రారంభించవచ్చని సూచించారు. ప్రభుత్వ నిర్ణయంతో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలకు ఊతం లభించనుందని, లబ్ధిదారులలో ఆనందం వ్యక్తమవుతోందని తెలిపారు.

## బస్సు అదుపుతప్పి ప్రమాదం - పలువురికి గాయాలు







**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) ఫిబ్రవరి 19 :** డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్సు ప్రమాదం హైదరాబాద్ నుంచి అనంత పురం వెళుతున్న ఏపీ.ఎస్.ఆర్.టి.సి.ఏపీ 39 జెడ్ 0557 గల బస్సు గురువారం తెల్లవారుజామున 4:20 నీ"సమయ మందు హైవే ఎన్ హెచ్ 44 వ రోడ్డులో ప్రమాదం.ఉండవల్లి మండలం ఇటిక్యాల పాడు స్టేజి కాడ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్సు అదుపుతప్పి బోల్తా పడింది.ఈ బస్సులో 20 మంది ప్రయాణికులు ఉండగా ఒకరి చెయ్యి వేలు విరిగాయి.మరో వ్యక్తి చెయ్యి నుజునుజ్జయింది మిగతా ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.గాయాలతో ఉన్న వ్యక్తులను చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించడం జరిగింది అని ఉండవల్లి ఎస్సై శేఖర్ తెలిపారు.

## అలంపూర్ మున్సిపల్ చైర్మన్‌గా పిండి జయరాముడు పదవీ బాధ్యత

**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) ఫిబ్రవరి 19 :** అలంపూర్ మున్సిపల్ చైర్మన్ గా గురువారం బాధ్యతలు చేపట్టడంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మహబూబ్నగర్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి రెడ్డి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టడంతో ఎమ్మెల్సీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** జిల్లాలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, ఎలాంటి కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో కఠిన తనిఖీలు చేపట్టాలని, సెల్‌ఫోన్లు సహా ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా నిషేధించాలని సూచించారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, హాలుల్లో గోడ గడియారాలు అమర్చాలని తెలిపారు. జిల్లాలో 25 కేంద్రాల ద్వారా 6,216 మంది మొదటి సంవత్సరం, 6,437 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.



సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి డాగ్ స్క్వాడ్‌కు ట్రాకర్ శునకం 'మాయ' చేరిక

### – నేర చేదనలో నూతన శక్తి... వనపర్తి పోలీసులకు ట్రాకర్ 'మాయ' బలం – జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి):** నేరాల చేదనలో ఆధారాలను గుర్తించేందుకు వనపర్తి జిల్లా పోలీసు విభాగానికి మరింత బలం చేకూరింది. డాగ్ స్క్వాడ్‌కు "మాయ" అనే ట్రాకర్ శునకం నూతనంగా చేరినట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ తెలిపారు. హైదరాబాద్ సమీపంలోని మోహినాబాద్‌లో ఉన్న పోలీస్ డాగ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎనిమిది నెలలపాటు ప్రత్యేక శిక్షణ పొందిన "మాయ" ఫీల్డ్ విధులకు సిద్ధమైందన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో డాగ్ హాండ్లర్ కానిస్టేబుల్ దేవ్యానాయక్ ఎస్పీని కలుసుకుని శిక్షణ వివరాలు తెలియజేశారు. శిక్షణ సమయంలో అనుమానాస్పద వస్తువుల గుర్తింపు, నేరస్థుల అడుగుజాడల పసిగట్టడం, క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించడం వంటి అంశాల్లో "మాయ" ప్రత్యేక నైపుణ్యం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జరిగే దొంగతనాలు, హత్య కేసుల దర్యాప్తులో ట్రాకర్ శునకం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. నేరస్థలంలో లభించే ఆధారాలను పసిగట్టి దర్యాప్తుకు స్పష్టమైన దిశానిర్దేశం అందించడంలో శునక దళం సేవలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నేరాలను ఆధారాలతోనే చేదించాలనే దృక్పథంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ నిఘా వ్యవస్థలతో పాటు శునక దళాన్ని సమన్వయంతో వినియోగిస్తామని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ పోలీసుశాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మంత్రులచే మక్తల్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

### రాష్ట్రస్థాయి క్రీడల ఏర్పాటను పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీనివాస్

**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి):** 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు మక్తల్ వేదికగా పది జిల్లాలతో నిర్వహించినటువంటి రాష్ట్రస్థాయి పోటీలు మళ్లీ ఎన్ని ఏళ్ల తర్వాత మక్తల్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పలువురు మంత్రులతో కలిసి ప్రారంభించనున్నట్లు నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం సాయంత్రం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 20 నుండి సోమవారం 23వరకు సీఎం కబడ్డీ కప్ పోటీలు కొనసాగుతాయని, ఇట్టి రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీల్లో ప్రారంభోత్సవానికి మంత్రులు దామోదర రాజనర్సింహ, భట్టి విక్రమార్క, ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు



అధికారులు పాల్గొననున్నారని, గతంలో 1997 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు పది జిల్లాల క్రీడాకారులతో రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించినట్లు మళ్లీ 35 సంవత్సరాలు తర్వాత 33 జిల్లాలలోని 66 జట్ల క్రీడాకారులతో స్థానిక క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు కట్టు దిట్టమైన రక్షణ ఏర్పాట్లతో క్రీడాకార్లకు వసతి ఏర్పాట్లు చేశామని.ఎక్కడ ఎలాంటి లోటు పాట్లు ఉన్న సంబంధిత అధికారుల దృష్టికి తీసు కెళ్లాలని ఆయన అన్నారు. 33 జిల్లాల నుంచి 66 జట్లు క్రీడాకారులు బరిలో దిగనున్నారు. అందులో 33 జట్లలో మహిళా క్రీడా కారుల జట్లు ఉంటాయని. వీరికి పట్టణంలోని నాల్గు హాస్టల్లో పాఠశాల్లో ప్రత్యేక గదుల్లో పూర్తిస్థాయి ఆకామిడేషన్, ఫుడ్డు, ఏర్పాట్లు చేశామని వీటిని మండలస్థాయి అధికారుల పర్యవేక్షణ నిర్వహిస్తారని. మహిళా కీడాకార్లకు మహిళా పోలీసులచ్చే రక్షణతో పాటు సీ సీ టీవీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. సుమారు 1500 మంది పైగా క్రీడాకారులు, కోచులు, సహాయక సిబ్బంది, పీఈటీలు, ప్రముఖులు పాల్గొంటా రని ఎర్పాట్లలో లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయి ఆకామి డేషన్ పోలీసుల రక్షణ వ్యవస్థను.ఎర్పాటు చేశామన్నారు.వీటిని స్థానిక తాసిల్దార్ సతీష్ కుమార్. పుర కమిషనర్ శ్రీరామ్. ఎంపీడీవో రమేష్. డీఎస్ఓ వెంకటేష్ పర్యవేక్షిస్తారని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

# శ్రీధర్ రెడ్డి హత్యకేసులో న్యాయం చేయాలి

### జిల్లా ఎస్పీ సునీతా రెడ్డితో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి భేటీ



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి):** చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్యకేసులో వేగవంతమైన విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డిను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్యకేసులో వేగవంతమైన విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ కుటుంబానికి న్యాయం జరగలేదని పేర్కొంటూ, కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీని విజ్ఞప్తి చేశారు. అధికారులు మారుతున్నప్పటికీ కేసు పురోగతిలో స్పష్టత లేకపోవడం ఆందోళనకరమని తెలిపారు. అదేవిధంగా, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో కింది స్థాయి అధికారులు ఒత్తిడులకు లోనై తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపిస్తూ, అవసరం లేకుండానే వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీతా రెడ్డి నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా వ్యవహరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఎస్పీ సునీత రెడ్డికి ఘన సన్మానం అనంతరం జిల్లా ఎస్పిని నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, మాజీ చైర్మన్ కరుణశ్రీ, శివప్రసాద్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కర్రీస్వామి, శివరామ్ రెడ్డి, దొడ్ల రాములు, ఎద్దుల సాయి కుమార్, జాత్రు నాయక్, పానుగంటి విజయ్ మోహన్, ఎం.రమేష్, టి.కురుమయ్య, అబ్దుల్ మహమూద్, సయ్యద్ జమీల్, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి గ్రామంలో మారెమ్మ అవ్వ గుడి నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన





**మల్దకల్ ఫిబ్రవరి 19(ప్రజా జ్యోతి డివిజన్) :** మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మ అవ్వ గుడి నిర్మాణ కార్యక్రమానికి గురువారం ఘనంగా శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, ఉపస ర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గుడి నిర్మాణాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, పెద్దపల్లి గ్రామం సురక్షితంగా ఉండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని మారెమ్మ అవ్వను ప్రార్థించారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామం గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ బి.శంకరన్నకు ఘన సన్మానం



**గద్వాల ఫిబ్రవరి 19(ప్రజా జ్యోతి డివిజన్) :** గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బి.శంకరన్నకు గువ్వలదిన్నె గ్రామ ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు ఘన సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎం.ఆర్.పి.ఎస్ ప్రతినిధులు డా.బి ఆర్ అంబేద్కర్ చిత్రపటం, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజాసేవలో మరింత కృషి చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని వారు ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన బి.శంకరన్న మాట్లాడుతూ,ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించిన ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు.మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సి.ఎం.సురేష్



**ఐజా (ప్రజా జ్యోతీ) ఫిబ్రవరి 19 :** ఐజా మున్సిపల్ కమిషనర్ సైదులు మేనేజర్ అశోక్ రెడ్డి మున్సిపల్ సిబ్బంది సమక్షంలో వేద పండితుల ఆధ్వర్యంలో సీఎం.సురేష్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మున్సిపల్ చైర్మన్ గా సీఎం.సురేష్.వైస్ చైర్మన్ మాల నరసింహులు తో కలిసి బాధ్యతలు చేపట్టడం జరిగింది. మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టడంతో అభిమానులు, బిఆర్ఎస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసారు.

# ఆపదలో ఆదుకునే సంజీవని 108 అంబులెన్సు

**- జిల్లా మేనేజర్ శ్రీనివాస్**




**హసన్‌పర్తి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండల పరిధిలోని 108 అత్యవసర అంబులెన్సు వాహనాన్ని హనుమకొండ జిల్లా మేనేజర్ మంద శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న అత్యవసర ఔషధాలు, కాలం చెల్లిన ఔషధాలు వేరు చేసి తొలగించారా లేదా, వైద్య పరికరాలు సమర్థంగా పనిచేస్తున్నాయా అనే అంశాలను పరిశీలించారు. అపద సమయంలో ప్రజలు 108 కు సమాచారం అందించిన వెంటనే సిబ్బంది ఆలస్యం చేయకుండా సంఘటన స్థలానికి చేరుకొని ప్రాథమిక చికిత్స అందించి బాధితులను ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. ఎండాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎండల కారణంగా కలిగే అనారోగ్య సమస్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ఔషాదాలు వాహనాల్లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఇప్పటివరకు 150 అత్యవసర ఘటనలకు సకాలంలో సేవలందించిన సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పైలెట్లు నాగరాజు, ఓదెలు, మెడికల్ టెక్నీషియన్స్ ప్రకాష్, నరేష్ పాల్గొన్నారు.

# చత్రపతి శివాజీ జీవితం ఎంతో ఆదర్శప్రాయం

**- డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి**



**నర్సంపేట ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట చత్రపతి శివాజీ గొప్ప పోరాట యోధుడే కాకుండా ఆయనే భారతీయ సామాజిక ముఖ చిత్రాన్ని మార్చిన ఒక గొప్ప విప్లవ కారుడిగా కూడా చరిత్రలో నిలిచిపోయారని బాలాజీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ రెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని బాలాజీ డిగ్రీ కళాశాలలో ఇటీవల నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మన్ శ్రీమతి పెండం శ్రీలక్ష్మీ రామానంద్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవే లక్ష్యంగా పనిచేస్తానని నర్సంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కష్టపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వనజ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి ప్రిన్సిపల్ మోర్తల రామరాజు కౌన్సిలర్లు, మాదాసి రవి, బాణాల లక్ష్మీ ప్రసన్న, శ్రీనివాస్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## విలీన గ్రామాల కార్మికులకు మున్సిపాలిటీ కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలి

- మున్సిపాలిటీ కమిషనర్‌కి వినతి పత్రం
- 10 వార్డు కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్



**నర్సంపేట ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట విలీన గ్రామాల కార్మికులను మున్సిపాలిటీ కార్మికులుగా గుర్తించి, మున్సిపాలిటీ కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలతో పాటు చెల్లించాలని 10 వార్డ్ కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ అన్నారు, విలీన గ్రామాల కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా 10 వార్డ్ కౌన్సిలర్ హన్మకొండ శ్రీధర్ మాట్లాడుతూ నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో 2025 ఫిబ్రవరి 6 తేదీన 8 గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నాటి నుండి నర్సంపేట మున్సిపాలిటీ విలీనమైన 8 గ్రామల కార్మికులు 36 మంది గత సంవత్సర కాలంగా నర్సంపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్నారు, విలీనం చేసిన 8 గ్రామల కార్మికులకు మున్సిపాలిటీ కార్మికులకు చెల్లిస్తున్న 16,600 వేతనాన్ని చెల్లించపోవడం దారుణమని అన్నారు. గత సంవత్సరం కాలంగా చేస్తున్నది మున్సిపాలిటీ పని అయినప్పటికీ మున్సిపాలిటీ కార్మికులగా గుర్తించకుండా పంచాయతీ కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలు చెల్లించడం అన్యాయమని అన్నారు, ఈ సమస్యను పరిష్కరించాలని 36 మంది కార్మికులు అనేకసార్లు మున్సిపల్ కమిషనర్ కు విన్నవించిన పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వివరించడం సరికాదని అన్నారు. కొంత మంది మున్సిపాలిటీ అధికారులు మీకు జీతాలు పెంచే ప్రయత్నం చేస్తానని కార్మికుల దగ్గర నుండి డబ్బులు వసూలు చేసి అవినీతికి పాల్పడడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు ఇప్పటికైనా విలీన గ్రామాల కార్మికులను మున్సిపాలిటీ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నటువంటి కార్మికులకు 16600 జీతాన్ని అమలు చేయాలని మున్సిపాలిటీ కార్మికులు ఏ విధమైనటువంటి సౌకర్యాలు ఉన్నాయో అవి కచ్చితంగా వీరికి అమలు చేయాలని లేకపోతే కార్మికులను సమీకరించి ఆందోళన పోరాటాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్మికులు, ఎండీ యాకుబ్, నర్రా కృష్ణ, కొర్ర వీరన్న, నల్ల మహేందర్, ముత్తినేని రమేష్, పోలబోయిన శ్రీను, బొల్ల పరాశరములు, కల్వచర్ల రమణాచారి, జెట్టబోయిన మల్లయ్య కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## 22న గురుకులాల ప్రవేశ పరీక్ష - ప్రిన్సిపాల్ ఎస్ సరిత



**రాయపర్తి ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో 2026 బి27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ గురుకులాలలో ఐదవ తరగతి తో పాటు ఆరు నుండి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే కామన్ ప్రవేశ పరీక్ష ఈనెల 22న జరగనున్నట్లు రాయపర్తి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల /కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ సరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 ఆదివారం రోజున నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ హాజరుకావాలని కోరారు. అభ్యర్థులందరూ హాల్ టికెట్లను వెంటనే డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. 22న ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా అభ్యర్థులు 10 గంటల వరకు సెంటర్ వద్ద కు చేరుకోవాలని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఫోటో అటస్ట్ చేసిన హాల్ టికెట్ తో పాటు, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన బోనఫైడ్ సర్టిఫికెట్ను తీసుకురావాలని తెలిపారు. పరీక్ష హాలుకు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తో పాటు వాటర్ బాటిల్ ఎగ్జామ్ పాడ్ వెంట తీసుకురావాలని ప్రిన్సిపల్ ఎస్ సరిత సూచించారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం







**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 19, (ప్రజా జ్యోతి):** తలసేమియా బాధిత చిన్నారులను ఆదుకునే ఉద్దేశంతో ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఛత్రపతి శివాజీ జయంతి మరియు దెంచనాల కివాన్ జన్మదినం సందర్భంగా ఫిబ్రవరి 19, 2026 గురువారం హనుమకొండ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో ఈ రక్తదాన శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేంద్ర నాగవెల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రెడ్ క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, న్యాయవాది వద్దిరాజు గణేష్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, రక్తదానం ద్వారా తలసేమియా బాధితులకు పునర్జన్మను అందించవచ్చని తెలిపారు. తలసేమియా చిన్నారులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, ముఖ్యంగా వేసవి కాలంలో రక్త కొరత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి తలసేమియా బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను అభినందించారు. ఈ శిబిరాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు నరేంద్ర నాగవెల్లికి కృతజ్ఞతలు తెలిపారు. 40 మంది రక్తదాతలు రక్తదానం : ఈ కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, బిళ్ళ రమణారెడ్డి, విశ్రాంత ఇంజనీర్ సత్యనారాయణ రావు, ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ నాగవెల్లి సరిత నరేంద్ర, ప్రధాన కార్యదర్శి అనిశెట్టి వెంకటేష్, ఉపాధ్యక్షుడు కందికొండ వెంకటేష్, డైరెక్టర్ సవరం రంజిత, సభ్యులు మునిగంటి అమరేంద్ర చారి, అజయ్, రూపేష్, సురేష్, సందీప్, రాజేందర్, రవి నాయక్, రాజేష్ నాయక్ తదితరులు, రెడ్ క్రాస్ సిబ్బంది మరియు రక్తదాతలు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉత్పత్తి చేయడంలో సోలార్ శక్తి కీలకం





- ఆత్మకూరులో సోలార్ ప్యానల్ ప్రారంభం
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**ఆత్మకూరు, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** విద్యుత్ ఉత్పత్తి చేయడంలో సోలార్ శక్తి కీలకమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. మోడల్ సోలార్ విలేజ్ ప్రోగ్రాం కింద ఎంపికైన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం ఆత్మకూరులో లబ్ధిదారు ఇంటి పైన ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్ ల ద్వారా సౌర విద్యుత్ ఉత్పాదక యూనిట్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిలతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి గురువారం ప్రారంభించారు. సౌర విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన సోలార్ ప్యానల్ వద్ద ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడల్ సోలార్ విలేజ్ కింద ఎంపికైన ఆత్మకూరు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్యానల్ గురించిన వివరాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. గ్రామంలో 1171 గృహ జ్యోతి సర్వీసులకు ప్రతి గృహం పైన రెండు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్ ను అమర్చనున్నట్లు అధికారులు తెలియజేశారు. సౌర విద్యుత్ ను గృహ అవసరాలకు సరిపోగా మిగిలిన విద్యుత్తును నెట్ మీటర్ ద్వారా గ్రిడ్ కు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. దీంతో గృహ వినియోగదారులు అదనపు ఆదాయం పొందుతారని వివరించారు. అదేవిధంగా గ్రామంలో ఉన్న 468 వ్యవసాయ పంప్ సెట్లకు 7.5 కిలోవాట్ల సోలార్ యూనిట్ను అమర్చనున్నట్లు పేర్కొన్నారు. సోలార్ యూనిట్లకు అయ్యే వ్యయం ( సుమారుగా 48.35 కోట్ల ఎమ్మెన్నార్ ఈ రాయితీ మినహా) తెలంగాణ ప్రభుత్వం భరించి గృహాలకు, వ్యవసాయ పంపుసెట్లకు ఉచితంగా తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తుందని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మహేశ్వరి, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, డీఈ మల్లికార్జున్, టీజీ రెడ్కో డీఎం మహేందర్ రెడ్డి , తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో జరిగిన అవమానం

# భరించలేకనే పార్టీ మార్పు



**మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం**

**నర్సంపేట ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా 18 వార్డు ప్రజలకు శిరస్సువంచి నమస్కరించి తెలియజేయునది. కొంతమంది బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన వ్యక్తులు టికెట్ ఇవ్వకపోతేనే పార్టీ మారుతారా అంటూ మా మీద దుష్ప్రచారం చేయడం జరుగుతుందని..కావున పార్టీ మార్పు గల కారణాలు తమ అందరికీ తెలియాలని సోషల్ మీడియా ముఖంగా మాట్లాడడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం మాట్లాడుతూ మేము బిఆర్ఎస్ పార్టీకి 18వ వార్డు ప్రజలకు నిరంతరం సేవలు అందించడం జరిగింది అని అన్నారు. అందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలో 18వ వార్డు కౌన్సిలర్ సీటు మాకు కేటాయించాలని పలుమార్లు మాజీ ఎమ్మెల్యే దగ్గరికి వెళ్లడం జరిగింది అని అన్నారు.. ఒక రోజు ఎన్జిఓ కాలనీ పెద్దలను మాజీ ఎమ్మెల్యే దగ్గరికి తీసుకువెళ్లగా..వారి అందరి సమక్షంలోనే మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సేవ చేస్తే ఓట్లు పడతాయా, ప్రజల కాళ్లు మొక్కుతే ఓట్లు పడతాయా అని మమ్మల్ని కించపరిచే విధంగా మాట్లాడడం జరిగింది అని తెలిపారు. ఆయన కానీ మరుసటి మరోసారి మాజీ ఎమ్మెల్యే గ్రీన్ రిసార్ట్లో ఉండగా వారిని కలవడానికి మా కుటుంబ సభ్యులం కలిసి వెళ్లడం జరిగింది అని. మాజీ ఎమ్మెల్యేను కలిసిన తరుణంలో పక్కన తక్కలపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే పిఏ రాజు ఉన్నారు వారి సమక్షంలో మాకు ఎలాగైనా టికెట్ కేటాయించాలని మా కుటుంబ సభ్యులం వారి కాళ్ళ మీద పడ్డామని అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంటనే గన్ మెన్ పరమేష్ ను పిలిపించి ఇలాంటి వాడిని లోపలికి ఎందుకు పంపించావ్..మరోసారి వీళ్ళు వస్తే లోపలికి పంపించకు అని గన్ మెన్ ను హెచ్చరించడం జరిగింది అన్నారు. కానీ జరిగిన అవమానాన్ని భరించి, బాధను దిగమింగు కొని అదే రోజు సాయంత్రం మరోసారి కలవడానికి వెళ్లగా వారు వస్తే లోపలికి పంపించద్దని చెప్పగా..వారునీ నేను కలవను అని చెప్పడం జరిగింది. కేవలం డబ్బుకు, అమ్ముడుపోయి.. మమ్మల్ని అన్ని రకాలుగా అగౌరపరచడం జరిగింది అని అన్నారు. టికెట్ ఇవ్వకపోయినా పర్లేదు కానీ, మనిషిని గౌరవించని చోట ఉండి, బానిస బతుకు బతకడం ఎందుకని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది అని అన్నారు. ప్రజాసేవ చేయకుండా, ఎన్నికల సమయంలో నోట్ల కట్టల డబ్బులు పట్టుకొస్తే ఓట్లు పడతాయా మాజీ ఎమ్మెల్యే తెలియచేయాలి అని అన్నారు. మాకు టికెట్ రాకుండా చేసిన కొంత మంది బిఆర్ఎస్ నాయకులకు భగవంతుడు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలతో సరైన బుద్ధి చెప్పించాడని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పెద్ది సుదర్శన్ రెడ్డికి నర్సంపేట ప్రజానికం కర్ర కాల్చి వాత పెట్టడం జరిగింది అని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన మమ్మల్ని వెన్నుపోటు పొడిచి నడిరోడ్డులో నిల్చబడితే.. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మమ్మల్ని ఆదరించి వారి హక్కున చేర్చుకున్నారు అని తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో 18వ వార్డు ప్రజలకు ఎల్లవేళల సేవలందిస్తామని, ప్రభుత్వం నుంచి వచ్చే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలందరికీ చేరే విధంగా చేస్తామని, 18వ వార్డును అద్భుతంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. మరోసారి నర్సంపేట గడ్డమీద ఎగిరేది కాంగ్రెస్ జెండే..మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై దొంతి మాధవ రెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు అని తెలిపారు. మాలాంటి పేదవాళ్లను మోసగించిన పెద్ది సుదర్శన్ రెడ్డిని భగవంతుడు కూడా క్షమించడు అని అన్నారు. నేను మాట్లాడిన ప్రతి మాట భగవంతుని సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అని అన్నారు. ఇక ముందు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మా మీద దుష్ప్రచారలు మానుకోవాలని అన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి

**రాయపర్తి ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి :** రాయపర్తి మండలం గణేష్ కుంట తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మూణావత్ తార్య అనారోగ్యంతో గురువారం మరణించగా పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి దేశాల మేరకు వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో.. తొర్రూర్ బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్, వర్ధన్నపేట వ్యవసాయం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి, గణేష్ కుంట తండా గ్రామ సర్పంచ్ మునవత్ రఘు, ఉప సర్పంచ్ ఈర, గట్టికల్ గ్రామ సర్పంచ్ చెవ్వ కాశీనాథం హేమలత, గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, రవి, భాస్కర్, నేతావత్ అశోక్, రవి మంగు, నరేష్, అశోక్, వర్ద సుధాకర్, సోమి, తదితరులు పాల్గొన్నారు.



## శివాజీ మహారాజ్ జయంతి

**విహెచ్‌పి, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలి**



**పరకాల, ఫిబ్రవరి 19, (ప్రజాజ్యోతి) :** భారతీయ పరాక్రమానికి ధైర్య సాహసాలకు నిలువుటద్దాం స్వరాజ్య - స్థాపకుడు. చత్రపతి శివాజీ మహారాజ్ వేడుకలను విశ్వ హిందూ పరిషత్ - భజరంగ్ దళ్ పరకాల శాఖ ఆధ్వర్యం లో బైక్ ర్యాలి అత్యంత వైభవంగా నిర్మహించడం జరిగింది. ఈ సందర్భంగా పరకాలలోని శివాజి విగ్రహంకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా.నాగబండి విద్యా సాగర్ పాల్గొని ఛత్రపతి శివాజీ గొప్పతనాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ వరంగల్ జిల్లా సహకార్యదర్శి గంద్ర శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కారదర్శి సుర రఘు, ఉపాధ్యక్షులు యుగేందర్ . భజరంగ్ దళ్ సంయోజక్ పేరాల రమేష్, రాజు తుమ్మ సతీష్, యుగేంద్ర చారీ బిజెపి కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, బిజెపి నాయకులు జయంత్ లాల్, రజనీకాంత్, పురుషోత్తం, అఖిల్, గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**ఆత్మకూరు, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** ధైర్యం, పరాక్రమం, న్యాయపాలనకు ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని శివాజీ ఉత్సవ కమిటీ చైర్మన్ ఏరుకొండ రవిందర్ గౌడ్, యువజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు పుష్పమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శివాజీ మహారాజ్ దేశభక్తి, స్వరాజ్య సాధన కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, శివాజీ జీవిత చరిత్రపై ప్రసంగాలు నిర్వహించారు. యువత శివాజీ ఆశయాలను అనుసరించి ధైర్యంగా, నిజాయితీగా ముందుకు సాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివాజీ మహారాజ్‌కు ఘనంగా జయజయధ్వానాలు చేశారు. శివాజీ మహారాజ్ విగ్రహానికి ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

## వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే రేవూరి





**పరకాల, ఫిబ్రవరి 19, (ప్రజాజ్యోతి):** గురువారం మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. వనదేవతల ఆశీస్సులతో పరకాల నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిచ్యా నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి



**రాయపర్తి ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్య తండా గ్రామంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మునావత్ కిషన్ నాయక్ తండ్రి మునావత్ బిచ్య నాయక్ అనారోగ్యంతో మరణించగా రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు వారి పార్థివ దేహానికి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించినరాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోత్ జాజు నాయక్, మాజీ ఎంపిటీసీ ఐత రామ్ చందర్, మండల పార్టీ నాయకులు మాలోత్ వసుంధర్, గ్రామ పార్టీ అధ్యక్షులు నారాయణ, ఉపసర్పంచ్ శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా సీమంతం కార్యక్రమం





**గుండాల, ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి):** గుండాల మండలంలోని వడ్డెర కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో సీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భవతుల ఆరోగ్య పరిరక్షణ, శిశువుల సక్రమ పెరుగుదల లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు వంటి సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం ద్వారా తల్లి-శిశువుల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. గర్భధారణ సమయంలో జాగ్రత్తలు పాటించడం, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామ ఉప సర్పంచ్ ఆవుల సాయిప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అంగన్వాడీ సిబ్బంది సూచనలు పాటించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ షమీం, ఏఎన్ఎం స్వర్ణలత, ఆశా కార్యకర్త సుజాత, అంగన్వాడీ టీచర్ కె. సునీత తదితరులు పాల్గొని గర్భవతులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ సభ్యులు, గర్భవతులు, బాలింతలు మరియు గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు



**మోత్కూర్ ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి)** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ పరిధిలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, వార్డ్ కౌన్సిలర్లు పాల్గొని గర్భిణీ స్త్రీలకు సమతుల్య ఆహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. సదస్సులో సిడిపిఓ యామిని మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఐరన్, కాల్షియం, ప్రోటీన్‌లు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్వైజర్ జ్యోతి గర్భిణీ స్త్రీలు పాటించాల్సిన జాగ్రత్తలు, టీకాలు, వైద్య పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరించారు. చైర్‌పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య మాట్లాడుతూ, తల్లి ఆరోగ్యం బాగుంటేనే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తాడని, ప్రతి గర్భిణీ స్త్రీ సమయానికి వైద్యులను సంప్రదించి, పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న మాట్లాడుతూ, మున్సిపాలిటీ తరఫున గర్భిణీ స్త్రీల సంక్షేమానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా పోషకాహార కిట్లు పంపిణీ చేశారు.

## కొర్ర తండాలో సంఘ
# బంధం భవనానికి శంకుస్థాపన



**కొండమల్లేపల్లి,ఫిబ్రవరి 19, (ప్రజా జ్యోతి):** దేవరకొండ నియోజకవర్గం: పరిధిలోని కొర్ర తండ గ్రామపంచాయతీలో సంఘ బంధం (వీవో) భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంప్రదాయాల ప్రకారం భవన స్థలంలో ముగ్గు వేసి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం దేవరకొండ నియోజకవర్గ శాసనసభ్యులు బాలునాయక్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ బుజ్జి లక్ష్మణ్ నాయక్ మరియు ఉపసర్పంచ్ కొర్ర నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమం లో ఏపీఎం యాదయ్య మాట్లాడుతూ సంఘ బంధం భవనం నిర్మాణంతో మహిళా సంఘాల కార్యకలాపాలకు సౌకర్యం కలుగుతుందని, గ్రామాభివృద్ధికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొర్ర లచ్చిరాం నాయక్, పి.ఆర్.ఏ.ఈ. ఇందిరాలాల్, సి.సి. వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, సంఘ బంధం అధ్యక్షురాలు రాణి, వార్డు సభ్యులు కొర్ర నీలా కిషన్ నాయక్, కొర్ర భీమా నాయక్, కొర్ర రాణీ దేనా నాయక్,కేతావత్ పద్మ వశ్య నాయక్,గ్రామ పెద్దలు కొర్ర కోమ్యా నాయక్, బాధ్య నాయక్, నాను నాయక్,బాలు నాయక్ గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళలు, యువత తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పోచమ్మ దేవాలయానికి శంకుస్థాపన

– మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ఆబీదు నగర్ గ్రామంలో పోచమ్మ తల్లి దేవాలయానికి మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమరావతి రామచంద్రారెడ్డి, నాయకులు కృష్ణంరాజు, పాలకవర్గం మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## యూరియా యాప్ రద్దు కై
# బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు

– ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్





**దేవరకొండ, పెద్దఅడిచెర్లపల్లి ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి):** ఆన్లైన్ యూరియా బుకింగ్ విధానం వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు బుకింగ్ చేసినా యూరియా అందకపోవడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులు మరియు అధికారుల నిర్లక్ష్యంపై నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంగడిపేట గెట్ వద్ద నిర్వహించిన మహా రైతు ధర్నా కార్యక్రమం పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ వారు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా యాప్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన పడ్డట్టు ఉంది.రైతులు యూరియా కోసం హరిగోస పడుతుంటే కనీసం ఈ ప్రభుత్వంలో చలనం లేదు కేసీఆర్ చెప్పినట్టు కాంగ్రెస్ పార్టీ ఆనాటి రోజులు తెచ్చింది.రైతు రాజ్యం కాదు.కాంగ్రెస్ పార్టీ దగా రాజ్యంకాంగ్రెస్ పార్టీ కి ఓటేస్తే పాత రోజులు వస్తాయని కేసీఆర్ గారు ఎప్పుడో అన్నారు కేసీఆర్ అన్న మాటనే నిజమైంది. అని ఇప్పుడు రైతులు గుర్తు చేసుకుంటున్నారు.కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పు చేసాం అని బాధపడుతున్నారు రైతులు 2 లక్షల రుణమాఫీ అన్నారు, రుణమాఫీ పూర్తి గా చేయకుండా రైతులను మోసం చేసారు. 15000 రైతు భరోసా అని చెప్పి ఉన్న రైతుబంధు ఎగొట్టారు వడ్లకు 500 బోనస్ అని చెప్పారు కాని అది కొంత వరకే అది ఎంది అడిగితే దాని ఊసే లేదు.వ్యవసయానికి 24 గంటల కరెంట్ అని చెప్పి రోజు నాలుగైదు సార్లు కోతలు పెడుతున్నారు ఫోన్ వాడడం సరిగ్గా తెలియని రైతులు ఆండ్రాయిడ్ ఫోన్లో ఫెర్టిలైజర్ ఈ యాప్ ని ఉపయోగించి ఓటీపీలు లాంటివి చేసి ఎలా యూరియాని బుక్ చేసుకోగలుగుతారు అని ప్రశ్నించారు యూరియా యాప్ తో కాకుండా డైరెక్ట్ గా రైతులకు యూరియా అందించాలి

**యూరియా యాప్ వల్ల రైతులు**

యూరియా విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ 90% మంది రైతులు ఫర్టిలైజర్ యాప్ ని వినియోగించుకోలేక పోతున్నారు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అంగడిపేట గెట్ వద్ద నిర్వహించిన మహా రైతు ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తో పాటు రైతులు పలువురు సర్పంచులు బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద మొత్తంలో పాల్గొని కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది

# దేశానికి అన్నం పెట్టేవాడు రైతు

- రైతుల సంక్షేమ ప్రజాపాలన ధ్యేయం
- సబ్సిడీ పథకాలను రైతులకు అధికారులు వివరించాలి
- 124 మంది రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ
- రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం

రాయితీ పై యంత్రాల పంపిణీ చేసిన : ఎమ్మెల్యే మందుల సామెల్





**తుంగతుర్తి, ఫిబ్రవరి 19,(ప్రజా జ్యోతి):** దేశానికి అన్నం పెట్టేవాడు రైతు అని, వ్యవసాయ రంగంలో ప్రస్తుతం టెక్నాలజీకి సంబంధించి యంత్రాలు ఉపయోగించే రైతులు వ్యవసాయం చేయడం జరుగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం రాయితీ పై యంత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మందుల సామెల్ హాజరయ్యారు. 6 మండలాలకు సంబంధించి అర్హులైన 124 మందికి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పత్రము ను వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా వ్యవసాయం యంత్రాల పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హులైన వారికి ప్రభుత్వం తరఫున సబ్సిడీ లో వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతుల అభ్యున్నతీ కి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో కూడా రైతులకు వ్యవసాయ పనిముట్లను అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా రైతులకు వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ అందజేస్తూ రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లను అందజేయడంతో రైతులు మంచి పంటలను పండించి రైతులకు మంచి గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా వ్యవసాయ రంగంలో రైతులు తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ రమేష్ బాబు, ఎంపీడీవో శేషు కుమార్, డిప్యూటీ తహసిల్దార్ కంఠమయ్య,తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి,తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న,తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, మద్దిరాల,నాగారం, నూతనకల్, అర్వపల్లి మండలాల అగ్రికల్చర్ అధికారులు అనిషా, కృష్ణ కాంత్, గణేష్, ఆయా మండలాల ఏఈఓ లు, తూర్పు గూడెం, సంగెం సర్పంచులు దాసరి రేణుక శ్రీనివాస్, కలకొట్ల మల్లేష్, 6 మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు





**గుండాల, ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి):** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం గుండాల మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో కార్యాలయం నుండి బస్టాండ్ వరకు యువత బైకులపై భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం గుండాల బస్టాండ్ వద్ద ఛత్రపతి శివాజీ గుండాల కమిటీ యువత ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు శివాజీ మహారాజ్ చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. తన రాజ్యంలో మహిళలకు అత్యున్నత గౌరవం కల్పించి, శత్రు రాజ్యాల స్త్రీలను సైతం తన సోదరీమణులుగా భావించిన మహనీయుడని పేర్కొన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడిన ధీరుడిగా శివాజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. భారత ఖండంలో అత్యధిక విగ్రహాలు కలిగిన మహారాజుగా శివాజీ మహారాజ్ ప్రత్యేక స్థానం పొందారని, అలాంటి మహానుభావుడు మన దేశంలో జన్మించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ గుండాల కమిటీ యువతతో శ్రీనివాస్, మధు, పరమేశ్వరి, సంగీత, శేఖర్, హరికృష్ణ, సోమన్న, సాయితేజ, శివ, ఉదయ్, మధు, మత్స్యగిరి, నోయెల్, ఈశ్వర్, చరణ్ అభిమానులు పాల్గొన్నారు.

# రాయకుంటపల్లిలో బెంచిలా ఏర్పాటు

– 12వ వార్డు సభ్యులు జూకంటి మధు



**ఆలేరు ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని రాయ కుంట పల్లి లో జూకంటి జెన్నయ్య పేరుతో మోటకొండూరు తో పాటు రాయికుంట పల్లిలో బెంచీలను 12వ వార్డు సభ్యులు జూకంటి మధు బహుకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల శ్రేయసే తన లక్ష్యమన్నారు. వృద్ధులను వికలాంగులను దృష్టిలో ఉంచుకొని జానయ్య పేరుమీద పలు చోట్ల బెంచీలను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్,మధు, యువకులు తదితరులు పాల్గొన్నారు

# ‘యాప్’ యాతన.యూరియా కోసం కోదాడ మండలం రైతన్నల అరిగోస!

– సాంకేతికత శాపంగా మారిన వైనం – సర్వర్ డౌన్‌తో ఎరువుల కోసం పడిగాపులు – పాత పద్ధతే ముద్దంటున్న అన్నదాతలు

**కోదాడ రూరల్, ఫిబ్రవరి 19( ప్రజాజ్యోతి) :** పొలం పనుల్లో నిమగ్నమవ్వాల్సిన రైతన్న ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ చేతబట్టి ఓటీపీల కోసం, సర్వర్ల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ‘యూరియా బుకింగ్ యాప్’ సామాన్య రైతులకు కన్నీళ్లు మిగులుస్తోంది.



కోదాడ మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ యాప్‌కు వ్యతిరేకంగా రైతులు నిరసనలు తెలుపుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని అనంతగిరి మండలం త్రిపురవరం వంటి గ్రామాల్లో రైతులు ఇప్పటికే రోడ్డెక్కి ధర్నాలు చేపట్టారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన ఈ డిజిటల్ విధానం ఆచరణలో విఫలమవుతోందని రైతులు మండిపడుతున్నారు.



ప్రధానంగా ఎదురవుతున్న ఇబ్బందులు గ్రామీణ ప్రాంతాల్లోని మెజారిటీ వృద్ధులు, నిరక్షరాస్య రైతులకు స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, ఉన్నా వాటిని వాడటం తెలియకపోవడం పెద్ద అడ్డంకిగా మారింది. ఓటీపీల గండం: కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం. పట్టాదార్ పాస్‌బుక్ యజమాని ఎక్కడో ఉండటంతో, బుకింగ్ సమయంలో వచ్చే ఓటీపీని సకాలంలో పొందలేక స్టాక్ అయిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్టాక్ వివరాలు అప్‌లోడ్ చేసిన 15 నిమిషాల్లోనే ‘స్టాక్ అయిపోయింది’ అని చూపించడం వెనుక పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని రైతులు అనుమానిస్తున్నారు. సర్వర్ మొరాయింపు: ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయత్నించినా సర్వర్ బిజీగా ఉండటం లేదా లోడింగ్‌లో ఆగిపోవడంతో ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు తప్పడం లేదు. అదనపు భారంతో రైతుల గోస బుకింగ్ ఐడీ వచ్చినా, అది తమకు నచ్చిన దుకాణంలో కాకుండా ఎక్కడో దూరంగా ఉన్న కేంద్రాల్లో అలాట్ అవ్వడంతో అదనపు రవాణా ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఒక బస్తా ధర సుమారు రూ. 266 కాగా, దాన్ని తీసుకురావడానికి కిరాయిలే బస్తా ధరను మించిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కోదాడ పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయం వద్ద కూడా రైతులు తమ ఆవేదనను వినతిపత్రాల రూపంలో అందజేశారు.

**రద్దు చేయాల్సిందేనని డిమాండ్**

ఇప్పటికే సాగు పెట్టుబడులు పెరిగి అప్పుల ఊబిలో ఉన్న తమకు, ఈ ‘యాప్’ కష్టాలు కొత్త తలనొప్పిగా మారాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. “గతంలో పాస్‌బుక్ చూపిస్తే వెంటనే ఇచ్చేవారు, ఇప్పుడు యాప్ ఉంటేనే ఇస్తామనడం సరికాదు” అని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. సాంకేతిక ఇబ్బందులను తొలగించి, పాత పద్ధతిలోనే ఎరువులు పంపిణీ చేయాలని లేదా గ్రామాల్లో నేరుగా పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోదాడ ప్రాంత అన్నదాతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ‘యాప్’ కష్టాలపై తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని రైతు సంఘాలు హెచ్చరిస్తున్నాయి. మాజీ సర్పంచుల సఈ సందర్భంగా తొగరు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైతులకు సాగు సమయంలో సకాలంలో ఎరువులు అందించలేని ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయి. చిన్నకారు, నిరక్షరాస్య రైతులకు మొబైల్ యాప్‌ల ద్వారా యూరియా అనడం వారిని వంచించడమే. రేపు జరగబోయే ఎంపీటీసీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఓట్ల కోసం గ్రామాలకు ఏ ముఖం పెట్టుకొని వస్తారు?” అని పాలకులను నిలదీశారు. రైతుల కష్టాలను గాలికొదిలేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన శాస్తి జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## చంద్రాయన్‌పల్లిలో చత్రపతి శివాజీ 396వ జయంతిని ఘనంగా నిర్వహించారు




**ఇందల్వాయి(ప్రజా జ్యోతి న్యూస్) ఫిబ్రవరి. 19** ఇందల్వాయి మండల కేంద్రంలోని చంద్రాయన్ పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ గ్రామ యువత చత్రపతి శివాజీ మహారాజ్. 396 జయంతి వేడుకలను గ్రామ సర్పంచ్ చారిటీ రఘు ఉపసర్పంచ్ సంజీవ్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయ కొట్టి నివాళులు అర్పించారు. వేడుకల్లో పాల్గొన్న గ్రామ పెద్దలు యువత మహిళలు శివాజీ మహారాజ్ చేసిన త్యాగాలను ధైర్య సాహసాలను స్మరించుకున్నారు దేశభక్తి స్వరాజ్య సాధనలో ఆయన పోషించిన పాత్రను కొని ఆడుతూ ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సర్పంచ్ అరటి రఘు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ చూపిన పరిపాలన దురదృష్టం ధైర్యం న్యాయపాలన ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తాయని అన్నారు ఉప సర్పంచ్ సంజయ్ గౌడ్ కూడా ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం భక్తి దేశభక్తి నినాదాలతో ఉత్సాహభరితంగా సాగింది ఈ జేతయాత్రలో పాల్గొన్న వీడిసి చైర్మన్ కొరువ నరసయ్య. రజక సంఘం అధ్యక్షులు దత్తు. ప్రభాకర్. తిరుపతి. నాగేష్ గౌడ్. శ్రీనివాస్ రెడ్డి. రాహుల్ సాగర్. లింగం ప్రవీణ్ అబ్బయ్య దాస్ సాయికుమార్ శేఖర్ కిషన్ ఓంకార్ కైలాస్ శ్రీనివాస్ కారబర్ రాజా గౌడ్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద్ హాస్పిటల్‌లో ఉచిత మెగా క్యాంప్

– ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తాం – వైద్యులు అప్పాలా అరుణ్ రెడ్డి



**ఆర్మూర్,పిబ్రవరి 19(ప్రజాజ్యోతి)** ఆర్మూర్ పట్టణం పెర్కిట్ లో ఆనంద్ మల్టీ స్పెషల్ హాస్పిటల్ లో డాక్టర్ ల బృందం చే మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంప్ కు మంచి ఆదరణ లభించింది అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని రక్త పరీక్షలు చేసుకొని ఉచిత వైద్యం అందుకొన్నారు. ప్రజలు ఆరోగ్యం పట్ల జగ్రత్తలు చూసుకోవాలని మెగా హెల్త్ క్యాంప్ నిర్వహణ ఉద్దేశం ఏంటి అని అంటే ప్రజలు వారి వారి పనులలో నిత్యం జీవన విధానం లో బిజీగా ఉండి వారి ఆరోగ్యం పై నిర్లక్ష్యం చేసుకుంటారు. ఇప్పటి రోజులు మనం తినే ఆహారం కూడా కల్తీ దే కాబట్టి ఎప్పుడు ఎ అనారోగ్యం వస్తుందొ తెలియదు గనుక ప్రజల కు మంచి ఆరోగ్యం అందించాలనే ఉద్దేశం తో మా యొక్క ఆనంద్ హాస్పిటల్ సంఖల్పం అనుభవం గల వైద్య బృందం చే వైద్యం అందిస్తాం మా ప్రత్యేకతలు ఏవంటే చిన్నపిల్లలా వైద్యం, గుర్భం తో వచ్చినవారికి డెలివరీ లు చేయడం సంతానం కొరకు వచ్చే వారికీ ప్రత్యేక పరీక్ష లుచేయడం యాముకలు ఇరిగినవారికే ఆర్థోపెటిక్ వైద్యం డాక్టర్ చే ప్రత్యేక వైద్యం అందిచబడును అలాగే జనరల్ మేడసిన్ దగ్గు జ్వరం విరోచనాలు కు మా హాస్పటల్ లో వైద్యం అందిస్తాం అని ఆర్మూర్ ప్రాంత ప్రజలు మా సేవలు వినయోగించుకోవాలని తెలిపారు. మెగా వైద్య శిబిరం లో డాక్టర్లు అరుణ్ రెడ్డి, పూజ రెడ్డి, రహీముద్దీన్, దీపక్, లతో పాటు ఆనంద్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ వర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్‌గా ప్రొఫెసర్ మహమ్మద్ మూసా ఖురేషి




**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 19 (ప్రజా జ్యోతి)** తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ మహమ్మ ద్ మూసా ఖురేషి ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ గా నియమితులయ్యారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు ఆదేశాల మేరకు నియామక పత్రాన్ని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. యాదగిరి చేతులమీదుగా అందుకున్నారు. తరువాత ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆర్ట్స్ డీన్ గా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్ట్స్ డీన్ గా పనిచేసిన ఆచార్య కె. లావణ్య డీన్ ఆఫీస్ బాధ్యతలను ప్రొఫెసర్ మమ్మద్ మూసా ఖురేషి కి అందచేశారు. ఈ సందర్భంగా పలు డిపార్ట్మెంట్ల అధ్యాపకులు నూతనంగా భాద్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఖురేషిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఖురేషి మాట్లాడుతూ ఆర్ట్స్ విభాగంలో పరిశోధనకు పెద్దపీట వేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమానిటీస్ ఫాకల్టీ తో పాటు ప్రిన్సిపాల్ ఆచార్య జి. రాంబాబు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. లక్షణచక్రవర్తి ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్, ఫార్మర్ డీన్ ఆచార్య కె. లావణ్య, ఆచార్య పి. కనకయ్య, డాక్టర్. ఏ. నాగరాజు, డాక్టర్. వాసంచంద్రశేఖర్, డాక్టర్. అతీఖ్ సుల్తాన్, వర్సిటీ భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు సిరికొండలో విద్యుత్ వినియోగదారుల సమస్యల స్వీకరణ




**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి,19 (ప్రజా జ్యోతి)** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికను సిరికొండ మండల కేంద్రంలో సబ్ స్టేషన్ లో ఏర్పాటు చేసినట్లు డీఈ హరిచంద్, ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. నేడు సిరికొండ సబ్‌స్టేషన్ ఆవరణలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. డిచ్పల్లి, ఇందల్వాయి, ఎల్లారెడ్డిపల్లి, ధర్పల్లి, సిరికొండ మరియు గడ్కోల్ సెక్షన్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. మీటర్ రీడింగ్ లోపాలు, బిల్లింగ్ సమస్యలు, తక్కువ వోల్టేజ్, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు, కొత్త కనెక్షన్లు, లైన్ సంబంధిత ఇబ్బందులు తదితర అంశాలపై నేరుగా అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులు తమ సమస్యలకు సంబంధించిన పత్రాలు, విద్యుత్ బిల్లుల ప్రతులతో హాజరుకావాలని అధికారులు సూచించారు. ఈ వేదిక ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నాబార్డ్ వారి సౌజన్యంతో నిజామాబాద్ డీసీసీబీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అవగాహన సదస్సు



**బాన్సువాడ ఆర్ సి ఫిబ్రవరి 19(ప్రజా జ్యోతి)** బాన్సువాడ మండలం కొల్లూరు గ్రామంలో నాబార్డ్ వారి సౌజన్యంతో నిజామాబాద్ డిసిసిబి బ్యాంక్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ.. వీక్ లో భాగంగా కొల్లూరు గ్రామంలో డిసిసిబి బ్యాంకు యొక్క స్కీమ్స్ మరియు పి ఎం జె జె బి వై, పి ఎం ఎస్ బి వై ఇన్సూరెన్స్ మరియు సైబర్ క్రైమ్ గురించి గోల్డ్ లోన్, కర్షక్ మిత్రా లోన్ స్కీం గురించి వివరించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సంజీవ్ గౌడ్ ,ఫీల్డ్ ఆఫీసర్ రాజేశ్వర్ , ఎఫ్ ఎల్ సి సి అంజయ్య,గ్రామ సర్పంచ్ నాందేవ్, మాజీ ఎంపీపీ చిన్న ,వెంకన్న గ్రామస్తులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# కల్తీ కల్లు పై ప్రశ్నిస్తే దాడులు చేశారు

– గ్రామపంచాయతీ కార్యాలయానికి పిలిపిచ్చి

గ్రామపంచాయతీ కార్లం ఎంపీడీవో ఎంఆర్ఓ కార్యాలయ ప్రాంగణంలో దాడులు చేశారు

– సర్పంచ్ శ్రీవారు గ్రామపంచాయతీ పిలిపించారు

– అందరి సమక్షంలోనే కళ్ళు ప్రియుని అయినా తనపై కళ్ళు విక్రయదారుడు లక్ష్మణ్ గౌడ్ దాడి చేశారు

– కల్తీకలు వల్ల కల్లు ప్రియులు అవుతున్నాం మాకు కాపాడండి

**బోధన్ ఆర్సి ప్రజా జ్యోతి** కల్లు పై ప్రశ్నిస్తే తనపై దాడులు చేశారు అని చందూరు సాయిలు తెలిపారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయం సాక్షిగా ఎంపీడీవో ఎంఆర్ఓ కార్యాలయం సాక్షిగా సర్పంచ్ శ్రీవారు తనను పిలిపించడం జరిగిందని పంచాయతీ అంటూ పిలిపించి వారి సమక్షంలోనే కల్లుబట్టి యజమాని లక్ష్మణ్ గౌడ్ తనపై దాడి చేయడం జరిగిందని కల్లు ప్రియుడు చందూరు సాయిలు అన్నారు. ఈ సందర్భంగా బాధితులు చందూరు సాయిలు మాట్లాడుతూ, గ్రామంలో కల్లు డిపో రెండు ఉన్నాయని రెండిట్లో కూడా కల్తీ కళ్ళు భారీగా విక్రయిస్తున్నారని కల్తీ కళ్ళు వల్ల జనం బేజారు అవుతున్నారని కళ్ళు సరిగా ఉండటం లేదని అన్నారు. తాను కల్లును సుమారు ఒక 15 సంవత్సరాలు నుంచి సేవిస్తున్నానని, అలాంటి కళ్ళు ప్రస్తుతం కల్తీ అవుతుందని దీనివల్ల అనేక సమస్యల వలయంలో అదే విధంగా వ్యాధుల బారిన పడుతున్నమని అది లేకపోయేసరికి పిచ్చి ఎక్కిపోతుందని, హానికరమైన కల్తీ మందులు విక్రయిస్తూ కళ్ళు ప్రియులను ఇబ్బంది పాలు చేస్తున్నారని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని, గురువారం రాత్రి కల్లు కార్యాలయం వద్ద అనగా కల్లు విక్రయ కార్యాలయం తన ఇంటికి సమీపంలో ఉంటుందని కళ్ళు సేవించడం కోసం వెళితే కళ్ళు సరిగా లేదని కల్తీ కళ్ళు ఉందని ఇదేమిటని ప్రశ్నించడం జరిగిందని, ఈ విషయం పై శుక్రవారం గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీవారు తనకు ఫోన్ ద్వారా గ్రామపంచాయతీ రమ్మని పిలవడంతో తాను గ్రామపంచాయతీ వెళ్లడం జరిగిందని అన్నారు. అందరి సమక్షంలోనే లక్ష్మణ్ గౌడ్ తనపై దాడి చేసి ఇబ్బంది పాలు చేయడం జరిగిందన్నారు ఈ విషయంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. సర్పంచ్ శ్రీవారికి వివరణ కోసం ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయలేదు. అనంతరం కల్లుబట్టి యజమాని లక్ష్మణ్ గౌడ్ కు ఫోన్ల వివరణ కోరగా సదురు చందరు సాయిలు అనే వ్యక్తి గ్రామంలో న్యూసెన్స్ సృష్టిస్తాడని కావాలని దుర్భాష పదజాలతో దూషించడమే కాకుండా కళ్ళు సీసాలు పగలగొట్టి నష్టం చేశారు అని, కల్తీ కళ్ళు విక్రయించాలని కల్లులో కల్తీ కలపాలని పదేపదే తమని రెచ్చగొడుతున్నాడని తమల్ని బెదిరింపులు చేస్తున్న అని సమాధానం ఇవ్వడం జరిగింది. అందుకే తాను దాడి చేసినట్టు కూడా తెలపడం జరిగింది. ఈ విషయమై బాధితుడు మాట్లాడుతూ ఒకసారి కళ్ళు రుచిగా లేదని చెబుతుండడం అదేవిధంగా దాడి చేశారని చెప్పడం మరొకసారి కల్తీ కల్లు అని చెప్పడం, సమాధానం ఇవ్వడం జరిగింది.

## ముల్లంగిలో ఉపాధి హామీ కూలీలతో డీసీసీ అధ్యక్షుడు కాట్‌పల్లి నగేష్ రెడ్డి భేటీ





**నిజామాబాద్ రూరల్: ఫిబ్రవరి, 19 (ప్రజా జ్యోతి)** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్పల్లి మండలం ముల్లంగి గ్రామంలో గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కాట్‌పల్లి నగేష్ రెడ్డి ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంపై తీసుకుంటున్న నిర్ణయాలను తీవ్రంగా విమర్శించారు. నగేష్ రెడ్డి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ పేరును రూపుమాపాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఉపాధి హామీ పథకంలో మార్పులు చేస్తున్నదని ఆరోపించారు. 125 రోజుల పని కల్పిస్తామని చెబుతున్నప్పటికీ, అందులో 50 రోజుల వేతన భారం రాష్ట్ర ప్రభుత్వాలపై మోపడం ద్వారా రాష్ట్రాలకు అధిక ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. గతంలో అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ సభల ఆధ్వర్యంలో సంవత్సరానికి 100 రోజుల పనులను గ్రామ ప్రజలే నిర్ణయించుకునే అవకాశం ఉండేదని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం అమలులోకి తీసుకువచ్చిన "జీ రామ్ జీ" పేరుతో కొత్త విధానం ద్వారా కార్పొరేట్ వ్యవస్థల ఆధిపత్యం పెరిగే ప్రమాదం ఉందని, గ్రామ ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి గ్రామ సర్పంచ్ సుధం శ్రీను, మాజీ ఎంపీపీ నర్సయ్య, ఏఎంసీ డైరెక్టర్ గంగారెడ్డి, ఉప సర్పంచ్ అశోక్, మాజీ సర్పంచ్ మధుసూదన్, డిచ్పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతిని మూడు పార్టీలు







**ధర్పల్లి: ఫిబ్రవరి/ 19 (ప్రజా జ్యోతి)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో చత్రపతి శివాజీ 396వ జయంతిని ఘనంగా నిర్వహించారు ముందుగా బిజెపి అధ్యక్షులు జెర్ర మైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ కి వేసి పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన చత్రపతి శివాజీ మారాట యోధుడు ఒక సామ్రాజ్యం ఏర్పాటు చేసి మారాట సామ్రాజ రక్షణ కొరకు బ్రిటిష్ కబంధహస్తాల నుంచి భారత్ కాపాడిన మహావీరుడు అతను ఇక్కడి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అన్నారు ఇప్పుడున్న ఈ ప్రభుత్వం శివాజీ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా జరపాలని లేకపోతే మేమే మిమ్మల్ని గజ్జి దింపి పోరాటం చేసే విజయం సాధిస్తామని ఆయన అన్నారు కాంగ్రెస్ వారు శివాజీ మహారాజును భక్తి పూర్వకంగా పూజించి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు అందులో ధర్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ యువతకు ఆదర్శం శివాజీ మహారాజ్ బ్రిటిష్ వారికి ఎదురొడ్డ పోరాడిన వీరుడు యువతకు ఆదర్శం అని అన్నారు సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్ మాట్లాడుతూచత్రపతి శివాజీ మారాట యోధుడు బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన చత్రపతి శివాజీ ఆయనను ఆదర్శ గా యువత తీసుకోవలనీ అన్నారు టిఆర్ఎస్ మండలమాజీ అధ్యక్షుడు నల్ల హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతిని ఘనంగా నిర్వహించారు దేశం మీద బ్రిటిష్ ప్రభుత్వం అరాచకాలను చూడలేక వారిపై ఎదురు తిరిగి పోరాడి గెలిచిన వ్యక్తి చత్రపతి శివాజీ అలాంటి ఎం పూజలు నిర్వహించాం ఎందుకంటే ఇప్పుడు దేశం అభివృద్ధి అంటేనే యువత మీద ఆధారపడింది కాబట్టి యువత ప్రతి ఒక్కరూ శివాజీ మహారాజ్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ధర్పల్లి మండల అధ్యక్షుడు ఆర్మూరు చిన్న బాల్రాజ్ సర్పంచ్ చెలి మేల శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎజ్జ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగిత్య నాయక్, సురేందర్ గౌడ్, ఏలేటి సంతోష రెడ్డి, తాళ్ల శ్రీధర్, గడ్డం మహేష్, చక్రపాణి డాక్టర్ నందు, అబ్దుల్ హమీద్, రాకేష్, బిజెపి పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, కర్క గంగారెడ్డి, కోమటి దాసు, సరిచేంద్, దోర్నాల రాజశేఖర్, అక్షయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు తాళ్ళ రాము, సేవాలాల్, లౌడ్య శ్రీనివాస్, తెరాస పార్టీ మాజీ అధ్యకులు, నల్ల హనుమంత్ రెడ్డి , కిశోర్ రెడ్డి, గడ్డం తిరుపతి రెడ్డి, ఎజ్జ సతీష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**సదాశివనగర్ ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహాల వద్ద రంగు రంగుల పూలతో అందంగా అలంకరించారు. ఫిబ్రవరి 19ని పురస్కరించుకొని గ్రామాలలో శివాజీ మహారాజ్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామాలలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీలు,శోభయాత్రలు నిర్వహించారు. డీజే చప్పుళ్ల మధ్య శివాజీ పాటలతో హోరెత్తించారు. జై భవాని.. వీర శివాజీ అంటు నినాదాలతో గ్రామాలలోని వీధులన్నీ మార్మోగాయి. యువత, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు .ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, పరిపాలనా దక్షత గురించి వివరించారు. మారాట సామ్రాజ్య స్థాపకుడు సామ్రాజ్యాన్ని స్థాపించి స్వరాజ్యం సాధించిన వీర శిరోమణి చత్రపతి శివాజీ మహారాజ్ స్వాభిమానం, ధైర్యం, స్వరాజ్యానికి ప్రతీక. సనాతన ధర్మ పరిరక్షకుడు, హిందూ సామ్రాట్ సర్వ మానవళికి దిక్సూచి ధర్మపాలనకు నిలువెత్తు రూపం శివాజీ మహారాజ్ స్వరాజ్య స్థాపన కోసం చేసిన పోరాటం, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి తరానికి ప్రేరణనిచ్చే దీపస్తంభమని అన్నారు. గ్రామాల్లో శోభాయాత్రలు నిర్వహించి, దేశభక్తి నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. చిన్నారులు శివాజీ వేషధారణలో పాల్గొని అందర్నీ ఆకట్టుకున్నారు. శివాజీ మహారాజ్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం మిఠాయిల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన సంఘ సభ్యులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# 22న ఉమ్మడి గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష




**సిద్దిపేటఅర్బన్,ఫిబ్రవరి 19(ప్రజాజ్యోతి):-** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఈ నెల 22వ తేదీ న నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శారద వెంకటేష్ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 5వ తరగతి ప్రవేశ పరీక్షతోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు గల ఖాళీలను కూడా భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకొని 22వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని సూచించారు. పరీక్ష కేంద్రాలను ముందుగానే తెలుసుకొని గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.హాల్ టికెట్ తో పాటు ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా విద్యార్థులు తమ వెంట తెచ్చుకోవాలని అన్నారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు పరీక్ష కేంద్రంలోకి ప్రవేశం ఉండదని సూచించారు.

# సీఎం కప్పు బాక్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు కొండపాక విద్యార్థులు ఎంపిక




**కొండపాక ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి):-** కొండపాక బాలుర పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సీఎం కప్ బాలుర బాక్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సముద్రాల శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలకు చెందిన డి శ్రావణ్ కుమార్, ఆర్ పవన్ , వి మురళీకృష్ణ, ఎస్ రాకేష్ , టి శివ లు ఎంపికయ్యారు అన్నారు రాష్ట్ర స్థాయి పోటీలు మహబూబ్ నగర్ స్టేడియంలో ఈనెల 20 నుండి 23 వరకు జరుగుతాయి. అలాగే నల్గొండ స్టేడియంలోజరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ జూనియర్స్ బాలుర కోకో పోటీలకు పాఠశాలకు చెందిన ఎస్ మహేష్ ఎంపికైనట్టు తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సముద్రాల శ్రీనివాస్ ఫిజికల్ డైరెక్టర్ నర్రా భాస్కర్ రెడ్డి సర్పంచ్ మంచాల నవీన శ్రీనివాస్ ఏ ఏ పీ సి చైర్మన్ భూలక్ష్మి రమేష్ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి



**సిద్దిపేట, ఫిబ్రవరి 19, (ప్రజాజ్యోతి):** విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులకు తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పిఎం శ్రీ పథకం అమలు పురోగతిపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎం శ్రీ పథకం కింద 34 ప్రభుత్వ విద్యాలయాల్లో నిర్మాణంలో ఉన్న సైన్స్ ల్యాబ్లు, మరుగుదొడ్లు, భవిత కేంద్రాల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను వెంటనే ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 22 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో జరుగుతున్న పనులను వంద శాతం పూర్తి చేసి, సంబంధిత బిల్లులను అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రతి నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామస్వామి, ఈడబ్ల్యుఐడీసీ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షల సాధనకు మార్గదర్శక అవగాహన సదస్సు




**సిద్దిపేట రూరల్ , ఫిబ్రవరి 19,( ప్రజాజ్యోతి):** సరైన మార్గదర్శకత్వం, కష్టపడి చదివే నిబద్ధత ఉంటే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అసాధ్యం కాదని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జీ.జీవన్ కుమార్ అన్నారు. గురువారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల భవిష్యత్ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని పోటీ పరీక్షలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. జీవన్ కుమార్ అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయ ఆచార్యులు డాక్టర్ పవన్ కుమార్ హాజరై పోటీ పరీక్షల ప్రాముఖ్యత, సిలబస్ అవగాహన, ప్రిపరేషన్ విధానం, టైమ్ మేనేజ్మెంట్, రాత పరీక్షలలో అనుసరించాల్సిన వ్యూహాలు వంటి అంశాలపై సమగ్రంగా ఉపన్యసించారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంత ముఖ్యమో విద్యార్థినులకు వివరించారు.పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు తమ సందేహాలను నేరుగా అడిగి నివృత్తి చేసుకున్నారు. ముఖ్యంగా గ్రూప్స్, బ్యాంకింగ్, రైల్వే, ఉపాధ్యాయ అర్హత పరీక్షలు వంటి వివిధ అవకాశాలపై స్పష్టమైన దిశానిర్దేశం అందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ జీవన్ కుమార్ మాట్లాడుతూ, మహిళా విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, అధ్యాపకులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణ దేవి, డాక్టర్ స్వప్న, కిషోర్, హరి ప్రసాద్, గణిత శాస్త్ర అధ్యాపకులు జీ. కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత చత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

– శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసిన కాంగ్రెస్ కౌన్సిలర్

– చత్రపతి శివాజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలి



**దుబ్బాక ప్రతినిధి , ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి)** భారతీయ యువత చత్రపతి శివాజీ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకొని దేశం కోసం, ధర్మం కోసం పని చేయాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లు అన్నారు. గురువారం రోజున చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని దుబ్బాక లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విదేశీ మొగలాయి రాజులు మన దేశం మీద దండెత్తి, స్త్రీల మీద అత్యాచారాలు చేసి, మన సంపద దోపిడి చేస్తున్నప్పుడు పదహారేళ్ళ వయసు లోనే వారిపై దండెత్తి మొఘలాయి సామ్రాజ్యాన్ని మట్టి కరిపించి చిన్న వయసులోనే ఛత్రపతి శివాజీ రాజుగా పట్టాభిషేకం చేశారని అన్నారు. అప్పటినుండి దేశం పట్ల భక్తి, దేశం యొక్క విలువ, స్వధర్మం మీద అభిమానం గురించి ప్రజల్లో చైతన్యం చేసి మొగల్ సామ్రాజ్యాన్ని భారతదేశంలో లేకుండా చేసారని అన్నారు.యువత చత్రపతి శివాజీ ని ఆదర్శంగా తీసుకుని దేశంలో ఉన్న కొంతమంది విదేశీ శక్తులు, దేశ ద్రోహులు దేశానికి నష్టం చేస్తున తరుణంలో యువత సంఘటితంగా ఉండి దేశం కోసం పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు అనంతుల భాగ్యమ్మ శ్రీనివాస్, తునికి సురేష్, శ్రీరామ్ సరస్వతి నరేందర్, ఐరేని అఖిల సాయి తేజ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఆకారం పాఠశాల విద్యార్థులు




**దుబ్బాక ప్రతినిధి , ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి)** సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఆర్య పార్య, వాలీబాల్ పోటీలకు ఆకారం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.నాగేందర్ గౌడ్ తెలిపారు. ఈనెల 12 న సిద్ధిపేట లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి, ఆర్య పార్య పోటీల్లో సంజన, అర్చిత, శ్రీనిధి, మనస్విని, జెస్సి నీలిమ, అఖిల్, సుశాంత్, సాత్విక్, వాలీబాల్ పోటిల్లో కృతిక రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈనెల 20వ తేదీ నుండి హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకారం విద్యార్థులను మండల విద్యాధికారి జోగు ప్రభుదాసు గారు ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు బి లక్ష్మీనారాయణ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# శివాజీ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలి

– సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజినీ)

– అప్పాజీపల్లిలో ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు







**కొల్చారం (ప్రజాజ్యోతి ) పిబ్రవరి 19:** హిందూ సామ్రాజ్య స్థాపన కోసం కృషిచేసి, పోరాడిన యోధుడు ఛత్రపతి శివాజీ అని అయన ఆశయాల సాధన కోసం యువత కృషి చేయాలని సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ ( గజినీ) అన్నారు. మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో గురువారం చత్రపతి శివాజీ విగ్రహ వ్యవస్థాపకులు, సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని) ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ (గజిని) మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత శివాజీ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చలం నర్సింలు, వార్డు సభ్యులు సదాల నర్సింలు, రామాంజం, వీరేశం, కన్నీబోయిన శరత్, యువజన నాయకులు చింతల సురేందర్, తిమ్మక్కపల్లి సుధాకర్, కాదూరి కుమార్ ,అతినగరం ప్రభాకర్, తిమ్మక్క పల్లి దుర్గాప్రసాద్,చింతల నాగరాజు ,కొరంపల్లి సాయికుమార్, జోగు రాజశేఖర్ ,కన్నే బోయిన అశోక్, పితిరి రవి ,ఛత్రపతి శివాజీ సంఘ సభ్యులు పాల్గొన్నారు

# అదుపుతప్పి లారీ బోల్తా

## తప్పిన ప్రమాదం



**కొండపాక ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి ):-** కొండపాక మండలం దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై మూలమలుపు వద్ద అదుపుతప్పి లారీ బోల్తా పడింది. సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు అల్యూమినియం కడ్డీలతో వెళ్తున్న లారీ గురువారం మూలమలుపు వద్ద అదుపుతప్పడంతో బోల్తా పడింది . ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

# మెకానిక్ 'వినూత్న' ఆలోచన.. అద్భుతం!

– ఫ్యాన్‌కే టేబుల్ ఫ్యాన్ అమరిక.. చూసినవారి ప్రశంస




**నర్సాపూర్ ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి)** అవసరం ఆవిష్కరణకు తల్లి అంటారు.. సరిగ్గా ఇదే సూత్రాన్ని నమ్ముకున్నాడు ఓ మెకానిక్. వేసవి కాలం ముంచుకొస్తున్న తరుణంలో, తన దుకాణంలో ఉన్న సీలింగ్ ఫ్యాన్ మొరాయించడంతో వినూత్నంగా ఆలోచించి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

**పై పంకాకు.. కింద పంకా జత!**

పట్టణంలోని ప్రధాన చౌరస్తా వద్ద ఉన్న సదరు మెకానిక్ షాపులో సీలింగ్ ఫ్యాన్ పని చేయకపోవడంతో ఉక్కపోత పెరిగింది. కొత్త ఫ్యాన్ కొనడమో లేదా బాగు చేయించడమో కాకుండా, తన వద్ద ఉన్న పాత టేబుల్ ఫ్యాన్‌ను నేరుగా సీలింగ్ ఫ్యాన్ రెక్కలకే అమర్చాడు. వైర్ల సాయంతో భద్రంగా కట్టిన ఈ 'హ్యాంగింగ్ టేబుల్ ఫ్యాన్' ఇప్పుడు దుకాణమంతా చల్లటి గాలిని అందిస్తోంది. మెకానిక్ చేసిన ఈ వినూత్న ఆలోచన ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది. దుకాణానికి వచ్చే వారు, అటుగా వెళ్లే వారు ఆ వింత ఫ్యాన్‌ను చూసి "మెకానిక్ ఆలోచన అమోఘం.. అద్భుతం" అంటూ కొనియాడుతున్నారు.

# మొఘల్‌లను ఎదిరించిన వీరుడు ఛత్రపతి శివాజీ

– సర్పంచ్ దేవన్నగారి శేఖర్, మాజీ సర్పంచ్ రాజగౌడ్ – కొల్చారంలో శివాజి విగ్రహ నిర్మాణానికి భూమిపూజ







**కొల్చారం (ప్రజాజ్యోతి) డిసెంబర్ 21:** యుద్ధతంత్రం లో ప్రసిద్ధి చెంది మొఘలు లను సమర్థవంతంగా ఎదుర్కొన్న యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ సర్పంచ్ దేవన్న గారి శేఖర్, మాజీ సర్పంచ్ రాజగౌడ్ లు స్పష్టం చేశారు. గురువారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో ఛత్రపతి యువజన సంఘం ఆధ్వర్యంలో శివాజీ విగ్రహ నిర్మాణానికి గ్రామ పురోహితులు కృష్ణ శర్మ వేదమంత్రముల మధ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ (1630-1680) గొప్ప మరాఠా యోధుడు, వ్యూహకర్త మరియు మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, బీజాపూర్ సుల్తాన్ ను ఎదిరించి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. ఆయన ధైర్యం, సైనిక నైపుణ్యం, లౌకిక పాలన, మత సహనం మరియు బలమైన ప్రభుత్వ వ్యవస్థకు ప్రసిద్ధి చెందారు, 1674లో రాయగఢ్ ఛత్రపతిగా పట్టాభిషేకం చేసుకున్నారు. తల్లిదండ్రులు తల్లి జిజాబాయి, తండ్రి షాజీ భోంస్లే లకు1630 లో ఫిబ్రవరి 19న శివనేరి కోటలో జన్మించారు. విద్యాభ్యాసం: తల్లి జిజాబాయి, సంరక్షకుడు దాదోజీ కొండేయో పర్యవేక్షణలో శిక్షణ పొంది, రామాయణ, మహాభారతాల నుండి స్ఫూర్తి పొందారు, యుద్ధ విద్యలు నేర్చుకున్నారు. బీజాపూర్ సుల్తానేట్ నుండి స్వతంత్ర మరాఠా రాజ్యాన్ని స్థాపించారు.



1674లో రాయగఢ్ కోటలో పట్టాభి షేకం జరిగింది. మత సహనం, మహిళల పట్ల గౌరవం, బలమైన ప్రభుత్వ వ్యవస్థను స్థాపించారు. ఏప్రిల్ 3, 1680 న రాయగఢ్ కోటలో తీవ్ర జ్వరంతో మరణించారు. శివాజీ మహారాజ్ ధైర్యం, దార్శనికత, నాయకత్వ లక్షణాలకు నిదర్శనంగా నిలిచారు, మరాఠా సామ్రాజ్యాన్ని విస్తరించారని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజాగౌడ్,ఉప సర్పంచ్ కోరంపల్లి రాణి గోపి,సంఘ మేశ్వర్, రాజి రెడ్డి,దుర్గాప్రసాద్ గౌడ్ ,ఎండుగుల కృష్ణ, చౌరిగారి చిన్న రాములు,ముత్యం ప్రవీణ్ కుమార్,లింగోల చెన్నయ్య , సంతోష్, ప్రశాంత్, హరీష్, వనమాల శ్రీధర్, చింతల కృష్ణ ,సాతెల్లి షేకులు, గడ్డం యాదగిరి, ఎర్రోళ్ల శ్రీనివాస్, కుమ్మరి శేఖర్, నెల్లి రాజు, ఎండుగుల శ్రీధర్, భాస్కర్, చింతల యాదగిరితో పాటు కమిటీ సభ్యులు సాకేత్, క్రాంతికుమార్, సాయి, దిక్షిత్, కిరణ్, ప్రసాద్, విశ్వర చారి, శ్రీధర్,వెంకటేష్, రాహుల్, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పాల్గొని భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హిందూ ధర్మ రక్షకుడు చత్రపతి శివాజీ మహారాజ్

– వెల్దుర్తిలో ఘనంగా స్వరాజ్య స్థాపకుడు శివాజీ జయంతి వేడుకలు



**వెల్దుర్తి ప్రజాజ్యోతి ఫిబ్రవరి 19** వెల్దుర్తి పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ దండెం ఆదర్శ్, ఉప సర్పంచ్ కమ్మరి శ్రావణ్ మరియు ఈవో బలరాం రెడ్డి ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు, స్వరాజ్య స్థాపనకు శివాజీ మహారాజ్ చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని కొనియాడారు.ప్రజల సంక్షేమం, న్యాయపాలన మరియు ధర్మ పరిరక్షణకు ఆయన విశేష కృషి చేశారు.సైనిక శక్తిని బలోపేతం చేసి సముద్ర దళాన్ని కూడా ఏర్పాటు చేసిన తొలి భారత రాజుల్లో శివాజీ ఒకరు.ధైర్యం, నాయకత్వం మరియు దేశభక్తికి ప్రతీకగా శివాజీ మహారాజ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు.ప్రతి ఒక్క యువకుడు ఛత్రపతి శివాజీ చరిత్రను తెలుసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని వారు ఆకాంక్షించారు. దేశం కోసం, ధర్మం కోసం, ఛత్రపతి శివాజీ చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది మరియు శివాజీ యూత్ పాల్గొన్నారు.



## 13వ వార్డులో మురుగునీటి కాలువ పనులకు శ్రీకారం

**- కౌన్సిలర్ సమీనా మీర్ తాహేర్ అలీ**



**పరిగి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** పరిగి మున్సిపాలిటీ 13వ వార్డులో తాత్కాలికంగా నిలిచిపోయిన మురుగునీటి కాలువ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం వార్డులో అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ కౌన్సిలర్ సమీనా మీర్ అలీ ముందడుగుతో కాలువ పనులను పునఃప్రారంభించారు. గతంలో ఆగిపోయిన మురుగునీటి కాలువలో నిల్వ వున్న నీటిని మున్సిపల్ సిబ్బంది సహాయంతో పంపు ఇంజన్ ద్వారా బయట పంపించారు. ఈ కాలువపై బెడ్ పనులు కూడా వెంటనే చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, "13వ వార్డులో ప్రజలకు సేవ చేసే అవకాశం మళ్లీ దక్కడం నాకు ఎంతో భాగ్యంగా భావిస్తున్నాని వార్డులో ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన పనులను వెంటనే చేపట్టేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. అదేవిధంగా ప్రజల సహకారంతో మున్సిపల్ సిబ్బందితో కలిసి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తాను" అని తెలిపారు. వార్డులో దీర్ఘకాలంగా కాలువ సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభం కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



**బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి):** మహా వీరుడు, స్వరాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలు కంటోన్మెంట్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమం ప్రారంభంలో జంపన ప్రతాప్ శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "హిందూ ధర్మ రక్షణ కోసం, స్వరాజ్యం స్థాపన కోసం శివాజీ మహారాజ్ చేసిన పోరాటం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ధైర్యసాహసాలతో ముందుకు సాగాలి" అని అన్నారు.ఈ వేడుకల్లో శేషీ రాజ్ యాదవ్, ప్రకాష్, దాదా రావ్, జిత్తు, కృష్ణ సాయి బాబా యాదవ్, బండి శ్రీనివాస్, నరసింహ, యాదగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఓల్డ్ బోయిన పల్లిలో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు





**బోయినపల్లి, ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి) :** హిందూ సామ్రాట్, అఖండ భారతావని హిందూ సామ్రాజ్య స్థాపకుడు, వీరుడు ధీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం ఓల్డ్ బోయినిపల్లిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు శివాజీ మహారాజ్ అభిమానులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, పరిపాలనా నైపుణ్యం నేటి తరానికి ఆదర్శమని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు ఏనుగుల తిరుపతి, నల్లోళ్ల శేఖర్, అంజన్న, తుకారాం, మహేందర్ తదితరులు హాజరై శివాజీ మహారాజ్ సేవలను స్మరించుకున్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం ఘన నివాళులు



**అబ్దుల్లాపూర్ మెట్టు ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి నివాసమైన సింహగడ్, ఛత్రపతి హిల్స్ బి.ఎన్.రెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి వెళ్లి చత్రపతి మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి శివాజీ మహారాజ్ ఒక మహా యోధుడు మాత్రమే కాదు, ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పరిపాలించిన గొప్ప నాయకుడని అన్నారు. స్వాభిమానం ధైర్యం దేశభక్తి, ధర్మ పరిరక్షణలో ఆయన చూపిన సంకల్పబలం నేటి తరానికి గొప్ప స్ఫూర్తి అని తెలిపారు.యువత శివాజీ మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో న్యాయం నిజాయితీ సేవా భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశం కోసం త్యాగం చేసిన మహానుభావుల జీవిత చరిత్రలను తెలుసుకొని, వాటి నుండి ప్రేరణ పొందాలని సూచించారు.ప్రజల సేవే తన ధ్యేయమని,శివాజీ మహారాజ్ చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## అగ్గనూర్ గ్రామంలో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు






**ముఖ్యఅతిథిగా సర్పంచ్ మంజుల భీమప్ప**

**యాలాల్ ఫిబ్రవరి 19 ప్రజాజ్యోతి :** అగ్గనూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మంజుల భీమప్ప హాజరై శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా యువజన సంఘం నాయకులు గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులకు, భక్తులకు భోజనాన్ని వడ్డించారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారుఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొని శివాజీ మహారాజ్ సేవలను స్మరించుకున్నారు. గ్రామంలో యువత ఆధ్వర్యంలో గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న యువకులు శివాజీ మహారాజ్ నినాదాలు చేస్తూ దేశభక్తి గీతాలతో గ్రామంలో సందడి చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత శివాజీ మహారాజ్ ధైర్యం, దేశభక్తి,న్యాయపాలన స్ఫూర్తిని తీసుకుని సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అగ్గనూర్ వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ ఉపాధ్యక్షులు: వినయ్ యాలల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరేశం,ఆనంద్,పండరీనాథ్,మధు, శ్రీనివాస్, నరేష్, శ్రీశైలం, వీరప్ప, అశోక్, రాజు శేఖర్ సుధాకర్ గౌడ్, హరికృష్ణ ప్రణయ్ రఘు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్కూల్స్, ఎస్‌హెచ్‌జి భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి






**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్ ప్రతినిధి,ఫిబ్రవరి 19(ప్రజా జ్యోతి):** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో కంపౌండ్ వాల్స్, మౌలిక వసతుల అభివృద్ధి పనులు స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల ఎంపీడీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మన ఊరు--మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో తరగతి గదులు, శౌచాలయాలు, తాగునీటి సదుపాయాలు, కంపౌండ్ వాల్స్ వంటి మౌలిక సదుపాయాల పనులు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల ప్రాంగణ భద్రత, అనధికార ప్రవేశాల నివారణ, విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. అన్ని వసతులు కల్పించడం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు తల్లిదండ్రుల్లో విశ్వాసం బలపడుతుందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఎస్ హెచ్ జి లకు ప్రత్యేక భవనాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ భవనాలు సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఆదాయోపాధి కార్యకలాపాలకు ఉపయోగపడతా యని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరుగుతుందని అన్నారు. ఇప్పటికే నిధులు మంజూరై ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, పారదర్శకతతో అమలు చేయాలని, మండలం వారీగా పురోగతి వివరాలు సమర్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్, జిల్లా పంచాయతి అధికారి జయసుధ, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్ కుమార్, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ డివిజన్ న్యూ జడ్జెస్ కాలనీ ఫేస్--1లో ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**ఎల్బీనగర్, ప్రజా జ్యోతి (ప్రతినిధి) :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని న్యూ జడ్జెస్ కాలనీ ఫేస్--1లో చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలు కాలనీ అధ్యక్షులు బి. శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్, జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ కొప్పుల నరసింహారెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు శ్రీమతి పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్ , కొప్పుల విట్టల్ రెడ్డి మాజీ కార్పొరేటర్, బిజెపి డాక్టర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ మొర్రిశెట్టి సంతోష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేములయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జక్కిడి సత్య తేజ రెడ్డి, పోచబోయిన సురేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు సుధీర్ రెడ్డి మరియు కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహోన్నత నాయకుడిగా చరిత్రలో నిలిచారని, తన తల్లి సూచనలను ఆచరిస్తూ అనేక విజయాలు సాధించిన వీరుడిగా ఆయన నేటికీ యువతకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ భేదాలు ఉండాలని, మిగతా సమయాల్లో ఐక్యతతో అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని సూచించారు. ఇటువంటి మహానుభావుల జయంతి కార్యక్రమాలు సమాజంలో ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఆదర్శవంతమైన నాయకుల జన్మదిన రోజులను పేద ప్రజలకు అవసరపడే కార్యక్రమాలు చేసినందుకు చాలా సంతోషిస్తున్న అని నూతన న్యూ జడ్జెస్ కాలనీ కమిటీని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బి. శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ శివాజీ జయంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ దిలీప్ కుమార్ కాంధర్ డయాబెటిక్ సెంటర్ ఆస్టోరియన్ ఫార్మసిటిక ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కే అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించామని, పేద ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకుని సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు, వైద్య బృందం మరియు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ చత్రపతి శివాజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు మారోజు షణ్ముఖా చారి, యం బిక్షపతి సాగర్, కమిటీ ప్రధాన కార్యదర్శి సి.హెచ్. యాదయ్య, సహ ప్రధాన కార్యదర్శి టి. సుకుమార్, కోశాధికారి వై. మాధవ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆర్. గోపినాథ్, జి.గోవిందరెడ్డి, డి.బిక్షపతి గౌడ్, పి.మోహన్ రావు, ఊర్మిళ, సంయుక్త కార్యదర్శి యం. శివ ముఖాడె, ఎస్ శంకర్ యాదవ్, జగదీష్ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే బి. కృష్ణ, సి. రమేష్, కె. అరుణ్ కుమార్, బి. చన్నయ్య, తదితరులు, కార్యవర్గ సభ్యులు, మహిళా ప్రతినిధులు డి.మహేశ్వరి, డి కావ్య, మోహినమ్మ, కృష్ణమ్మ, వెంకటమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

## హఫీజ్ పేట్ సాయినగర్‌లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు

**పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్**



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా బాలింగ్ గౌతమ్ గౌడ్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం శివాజీ మహారాజ్ చెసిన కృషి అనన్య సామాన్యమని కొనియాడారు.మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి,హిందవి స్వరాజ్యాన్ని స్థాపించిన వీరుడని పేర్కొన్నారు, స్వరాజ్యంలోని మహిళలనే కాకుండా ,శత్రు రాజ్యాల స్త్రీలను కూడా తన తోబుట్టువులుగా గౌరవించిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది అని అన్నారు.నేటి తరానికి శివాజీ మహారాజ్ జీవితం ఒక గొప్ప స్ఫూర్తి అని, ఆయన ధైర్యసాహసాలు, ధర్మం కోసం పోరాడే తత్వం మనందరికీ ఆదర్శమని గౌతమ్ గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రంజిత్ నాయి, కృష్ణ ముదిరాజ్, శంకర్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, శ్రీహరి,మల్లేష్, రాందేవ్, యేగేష్, అజయ్,కాలనీ వాసులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు



**తాండూరు ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి :** తాండూరు పట్టణం ఇంద్రనగర్‌లో గల శ్రీ రామ మందిరం దేవాలయం వద్ద ఆ కాలనీకీ చెందిన యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్ నిర్వాకుడు డాక్టర్ సంపత్ కుమార్,స్థానిక కౌన్సిలర్ బోయ అనిల్ కుమార్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పరిష్కరించుకొని ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన చేసిన త్యాగాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో భద్రప్ప, అంజిల్ రెడ్డి, దోమ కృష్ణ, యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## డయల్ యువర్ డిఎంను సద్వినియోగం చేసుకోవాలి

**20 ఫిబ్రవరి 2026న నేరుగా మాట్లాడే అవకాశం**



**తాండూరు ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి) :** తాండూరు బస్ డిపో పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు బస్సుల రాకపోకలపై ఎదుర్కొంటున్న సమస్యలను క్లుప్తంగా తాండూరు డిపో మేనేజర్ సురేష్ కు ఫోన్ చేసి తెలియజేసే అవకాశం కల్పించారు. ఈ అవకాశం నేడు శుక్రవారం రోజు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తాండూరు డిపో మేనేజర్ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు బస్సు ప్రయాణంలో వస్తున్న వివిధ సమస్యలపై సెల్ నెంబరు 9959226251 కు ఫోన్ చేసి ప్రయాణికులు తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం కోసం డిపో అధికారులు సూచించిన సమయాన్ని మాత్రమే వినియోగించుకోవాలని కోరారు.

## సయ్యద్‌పల్లిలో రేడియల్ రింగ్ రోడ్ భూసేకరణకు గ్రామసభ



**పరిగి, ఫిబ్రవరి 19 (ప్రజాజ్యోతి) :** పరిగి మండలం సయ్యద్‌పల్లి గ్రామంలో రేడియల్ రింగ్ రోడ్ భూసేకరణకు సంబంధించి గురువారం గ్రామసభ నిర్వహించారు. భూసేకరణ ప్రక్రియలో భాగంగా రైతులకు అవగాహన కల్పించడం, వారి అభిప్రాయాలు సేకరించడం లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. సమావేశానికి తహశీల్దార్ వెంకటేశ్వరి అధ్యక్షత వహించగా, డిప్యూటీ తహశీల్దార్ అనిల్ బాబు, గ్రామ సర్పంచ్, సర్వేయర్ కిరణ్, గిర్దావర్ దివ్య, జీపీవో రవీందర్ పాల్గొన్నారు. అధికారులు భూసేకరణకు సంబంధించిన విధివిధానాలు, పరిహారం చెల్లింపుల ప్రక్రియ, భూముల కొలతలు తదితర అంశాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సందేహాలు, అభ్యంతరాలు వెల్లడించగా, అధికారులు వాటికి సమాధానాలు ఇచ్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయమైన పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

## వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్‌కు ఘన సన్మానం

**శుభాకాంక్షలు చెప్పిన తాండూర్ చైర్ పర్సన్ నీరజ రెడ్డి**



**తాండూరు ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి :** వికారాబాద్ పురపాలక సంఘం నూతన చైర్ పర్సన్ గడ్డం అన్నణ్య ను తాండూర్ పురపాలక సంఘం చైర్ పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్ రెడ్డి దంపతులు వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ అనణ్య ను కలిసి సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాన్న (తెలంగాణ అసెంబ్లీ స్పీకర్) గడ్డం ప్రసాద్ కుమార్ తో మా కుటుంబానికి మంచి సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారం అన్ని వేళలా ఉంటుందని చెప్పారు. అలాగే తాండూరు మున్సిపల్ అభివృద్ధి కోసం మీ సహకారం కూడా అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, పలువురు కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

## నేటి నుండి బ్రహ్మోత్సవాలు

రాయికల్ ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి)
మండలంలోని భూపతిపూర్ గ్రామ నక్కలగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిపించుటకు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయినట్లు అర్చకులు వెంకట కృష్ణ తెలిపారు. వీరు మాట్లాడుతూ 20వ తేదీ శుక్రవారం నుండి 22వ తేదీ ఆదివారం వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని శనివారం 21వ తేదీ శనివారం రోజున సంతానం కాదలచిన దంపతులకు గరుడ ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.



నిర్వాహకులు మాట్లాడుతూ 22వ తేదీ ఆదివారం రోజున శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం, మహా అన్నదాన కార్యక్రమం రథోత్సవ కార్యక్రమం ఉంటాయని ఈ కార్యక్రమాలకి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకి పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు.

## ఫార్మేటివ్ అసెస్మెంట్ మార్కుల పరిశీలన చేసిన జిల్లా మానిటరింగ్ టీం

రాయికల్ ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి)
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇటిక్యాల లో గురువారం జిల్లా మానిటరింగ్ టీం సభ్యులు తాట్లవాయి ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు భోగ రమేష్, అల్లీపూర్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు బొమ్మకంటి రవికుమార్, రాయికల్



బాలికల ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు మండలోజు రవీందర్ పదవ తరగతి విద్యార్థుల ఫార్మేటివ్ అసెస్మెంట్ మార్కులను, సంబంధిత రికార్డులను పరిశీలించారు. అలాగే వారు పదవ తరగతి విద్యార్థులకు రాబోయే వార్షిక పరీక్షలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు సమయపాలనతో పాటు క్రమశిక్షణగా చదువుపై దృష్టి సారించి, వార్షిక పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సీమలదారి సదాశివ్, ఆర్.యు.పి.పి జిల్లా శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, గాజెంగి రాజేశం, హనుమంతరావు, జియావుద్దీన్, ముజాహిద్, స్వర్ణలత, శ్రీలత, నీరజ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి అన్ని విధాల సహకారం ఉంటుంది,

### విద్యార్థుల క్యాలెండర్ ఆవిష్కరించిన సందర్భంగా, మద్దుల గోపాల్ రెడ్డి,

ఎండపల్లి, ఫిబ్రవరి 19, ప్రజా జ్యోతి,
మండలంలోని సూరారం ప్రాథమిక పాఠశాల లో బోధిస్తున్న ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, శ్రీదేవి వారి సొంత ఖర్చులతో పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా క్రీడా దుస్తులు అందించడం,అలాగే మండల స్థాయిలోనే పాఠశాలలో మొదటిసారిగా విద్యార్థులకు కరాటే శిక్షణను ప్రారంభించడం




జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దుల గోపాల్ రెడ్డి హాజరై వారి చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు, విద్యార్థుల క్యాలెండర్ ను ఆవిష్కరించి అలాగే కరాటే శిక్షణను ప్రారంభించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పాఠశాల అభివృద్ధిలో నా వంతుగా పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పాఠశాలకు కావలసిన నీటి శుద్ధి యంత్రం, కంప్యూటర్స్, విద్యార్థులు ఆడుకోవడానికి జాయింట్ వీల్ జారుడు బల్ల ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోడిపెల్లి కొమురమ్మ శ్రీనివాస్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ ఉరిమెట్ల మంగ, ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, శ్రీదేవి,గణేష్ యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు,

## శ్రీ గంగా మాత శివపార్వతుల కళ్యాణ మహోత్సవం

(రాయికల్ ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి)
రాయికల్ పట్టణంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రాయికల్ చెర్ల కొండాపూర్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ గంగా మాత శివ పార్వతుల కళ్యాణం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు,ఆలయ నుండి విగ్రహాల మంగళ వాయిద్యాలతో కళ్యాణ మండపంలోకీ తీసుకవచ్చి,వేదికపై అలంకరించి బ్రహ్మణోత్తముల వేద మంత్రాల సాక్షిగా భక్తుల కోలాహలం మధ్య కళ్యాణం ఘనంగా నిర్వహించారు,అనంతరం అన్నదానంలో వేలాది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాలు స్వీకరించారు మున్సిపల్ చైర్మన్ కట్కం రవింధర్ ,వైస్ ఛైర్మన్ తురగ సౌజన్య శ్రీధర్ రెడ్డి లు అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవుని నారాయణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు తోపారపు రవింధర్,పల్లి కొండ పోచయ్య ఉట్నూరి రమేష్ ,కల్లేడ రంజిత్ ,చిట్యాల సురేష్ కౌన్సిలర్ లు కల్లెడ ధర్మపురి ,కునారపు మానస ,తోపరపు ప్రాశాంతి ,మేముల మౌనిక రాకేష్ నాయక్ పుర్రె శ్రీధర్ , పల్లి కొండ గంగాధర్, భూమేష్ ఆశన్న,సురేష్ తదితరులు



# విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి

### పదవ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి
### జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 19,(ప్రజాజ్యోతి ).. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం కల్లూరు లోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. గురువారం రోజున జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం కల్లూరు లోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అధికారులకు ఆదేశించారు. తప్పనిసరిగా పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించాలని, పాఠశాల ఆవరణలో పరిశుభ్రంగా ఉంచాలని అదేవిధంగా విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, వంటలు గ్యాస్ పొయ్యి మీదనే వండాలని, కూరగాయలు తాజాగా ఉండాలని వంట సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. అదేవిధంగా కిచెన్ గార్డెన్ వెంటనే



ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. పాఠశాల తరగతిలో పాఠాలు బోధించే ఉపాధ్యాయుల విధానము విద్యార్థులకు బోధించే విధానంను, భోజన వసతుల గురించి విద్యార్థులతో నేరుగా అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే క్రమశిక్షణ గల విద్య అవసరమని విద్యార్థులు అనుకున్న ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. అదేవిధంగా కిచెన్ గార్డెన్ లో కూరగాయల మొక్కలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కోరుట్ల పట్టణ కేంద్రంలోని జెడ్పి హెచ్ ఎస్ (గర్ల్స్) పాఠశాలలో నిర్మాణంలో ఉన్న సైన్స్ ల్యాబ్ ను పరిశీలన చేసి అక్కడి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ మరియు కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరగా ఇట్టి సైన్స్ ల్యాబ్ పూర్తి చేయాలని త్వరగా విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. తదుపరి టీజీ ఎంఎస్ కల్లూరులో పీఎం శ్రీ పథకంలోలో భాగంగా జరుగుచున్న మేజర్ అండ్ మైనర్ పనుల ప్రగతిని పరిశీలించి అక్కడి కాంట్రాక్టర్ తో మాట్లాడి వారంలోగా పనులు పూర్తి కావాలని ఆదేశించారు. అలాగే పాఠశాలలో ఎస్ఎస్సి విద్యార్థులు రాస్తున్నటువంటి ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహణ తీరును పరిశీలించారు . ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డి.ఈ.ఓ రాము, తహసీల్దార్, ఎంపిడివో, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణకు శివాజీ మహారాజ్ చేసిన సేవలు ఎనలేనివి,

### ఘనంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు,

ఎండపల్లి,ఫిబ్రవరి 19, (ప్రజా జ్యోతి) చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం రోజున మండలంలోని గుల్లకోట శివాజీ చౌక్ వద్ద శివాజీ కమిటీ






ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు శివాజీ మహారాజ్ చేసిన సేవలు ఎనలేనివని తన రాజ్యంలోని స్త్రీలను తన తోబుట్టువులుగా భావించి పసుపు,కుంకుమ, చీరలు ఇచ్చేవారని అలాంటి ధీరుడు మన దేశంలో జన్మించడం మన అదృష్టంగా భావించాలని అన్నారు.దేశంలో అత్యధిక విగ్రహాలు కలిగిన మహారాజు శివాజీ ఒక్కరేనని తెలియజేశారు.సాయంత్రం చత్రపతి శివాజీ ఆశయాలు,అవగాహన కల్పించే విధంగా శివాజీ కమిటీ,నిర్వాహకులు యువత భారీగా తరలివచ్చి డీజే చప్పుళ్ల మధ్య ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్నారు, అలాగే చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా యువకులకు పాఠశాల విద్యార్థులకు పులిహోర (వితరణ) పంపిణీ చేసి ఉదారత చాటిన గణేష్ యూత్ (కోడిపుంజుల పల్లె )వారికి ప్రజల నుండి అభినందన వెలువెత్తుతున్నాయి,కాగా మొట్టమొదటిసారిగా మహాత్మ జ్యోతిబాపూలే 1870లో ఫిబ్రవరి 19వ తేదీన పూణేలో శివాజీ జయంతి వేడుకను ప్రారంభించారు. ఆ తర్వాత బాలగంగాధర్ తిలక్ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఏకం చేయడానికి ఈ వేడుకను మరింత ప్రజలకు తెలిసేలా విస్తృతం చేసిన విషయం విధితమే.ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ కమిటీ అధ్యక్షులు మడి మహేష్ సభ్యులు గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్,ఉప సర్పంచ్ అరిగెల జయవ్వ,రవి,తాజా మాజీ ప్రజా ప్రతినిధులు,యువత పాల్గొన్నారు,

## గూడెం గ్రామంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

ముస్తాబాద్, ఫిబ్రవరి 19 ( ప్రజా జ్యోతి ):
ముస్తాబాద్ మండలంలోని గూడెం గ్రామంలో చత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శివాజీ యువత ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించబడ్డాయి.
ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గూడెం గ్రామ ప్రజలు, గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఈ సందర్భంగా నాయకులు శివాజీ మహారాజ్ జీవిత చరిత్రను స్మరించుకుని, ఆయన ధైర్యసాహసాలు, దేశభక్తి, పరిపాలనా ప్రతిభ గురించి ప్రస్తావించారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో దుంపలపల్లి అజయ్, బెదిర ప్రశాంత్, పెంటం నరేష్, మంగని అనిల్, బెదుర రాజు, జిల్లాల మల్లేష్, మాజీ సర్పంచ్ సరిత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ

ముస్తాబాద్, ఫిబ్రవరి 19 ( ప్రజా జ్యోతి ): ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన (ప్రధాన



మంత్రి ఉజ్వల పథకం) కింద కొండాపూర్ మరియు రామిరెడ్డి పల్లె గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మొదటి విడతలో భాగంగా 19 ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు మంజూరు చేయబడినవి. ఈ పంపిణీ కార్యక్రమం భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ముస్తాబాద్ మండల అధ్యక్షులు చిగురు వెంకన్న ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముస్తాబాద్ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సౌల క్రాంతి మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులందరికీ విడతల వారీగా వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ కొనసాగుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ గడ్డపై కాషాయ పతాకం ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.
చిగురు వెంకన్న ముదిరాజ్ మాట్లాడుతూ, గ్రామంలో ఇంకా అర్హులైన వారు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెండ్యాల మహిపాల్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ పరశురాములు, బూత్ అధ్యక్షులు గంధం అజయ్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, పెద్దూరు శ్రవణ్ గౌడ్, ఐలేని అంజిరెడ్డి, సుతార్ దేవయ్య, సర్దార్ సాయి గుడి, కందుల మహేందర్, జైపాల్ రెడ్డి, చందు, భరత్, చిగురు నరేష్, సీనియర్ నాయకులు ఈడుగురాళ్ల సురేష్ గౌడ్, శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బాద నరేష్ తదితరులు పాల్గొన్నారు.
అలాగే వెంకట అనసూయ, సర్దాని మాలతి, శనిగారం అనూష, దండిగల మౌనిక, మూడోపెల్లి భవాని, పెద్దూరి అవంతిక, గంతం ప్రణాళిక, ధర్ర వెన్నెల, సిహెచ్ అనిత, చిప్పల మానస, పల్లెపు పూరిత, నైలం లావణ్య, సప్న, శివరాత్రి, పల్లపు అవంతిక, కాసియా, అయ్యప్ప గీత, చిగురు సుమలత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

చొప్పదండి, ఫిబ్రవరి 19 ( ప్రజాజ్యోతి):
చొప్పదండి మండలం రాగంపేట జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థిని సిరవేణి శివప్రియ(8వ తరగతి) సీఎం కప్ రాష్ట్రస్థాయి 2వ ఎడిషన్ ఖో–ఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బాలసాని రాజ్ కుమార్ తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ టోర్నమెంట్ నల్గొండ లో ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రస్థాయి సీఎం కప్ ఖో–ఖో ఛాంపియన్ షిప్ లో బాలికల జట్టులో సిరవేణి శివ ప్రియ పాల్గొంటుందని ఆయన తెలిపారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన శివప్రియను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.దినకర్, గ్రామ సర్పంచ్ మామిడి రాజేశం, మండల విద్యాధికారి పి.మోహన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జి.అజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.




## మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

గంభీరావుపేట ఫిబ్రవరి 19 (ప్రజా జ్యోతి):
గంభీరావుపేట మండలం లోని నర్మల, దమ్మనపేట మోడల్ స్కూల్ లో గురువారం ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ మానసిక వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ సంతోష్ కుమార్ ల ఆధ్వర్యంలో బాల బాలికలకు ఆరోగ్యం పరిశుభ్రత మరియు ప్రాథమిక చికిత్స కొరకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు మరియు ఎక్సైజ్ ఎస్సై గారి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు డ్రగ్స్ గంజాయి తీసుకొని విద్యార్థులు బానిసలు కాకూడదని అలాంటివారికి దూరంగా ఉండాలని విద్యార్థులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ రమేష్ మరియు వైద్య సిబ్బంది మరియు వివిధ కళాశాలల ప్రిన్సిపాల్ సృజన, ఏ శ్రీలత తో పాటు విద్యార్థిన విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరలు ఎక్కడమ్మా..? ముస్తాబాద్ మండల్ లో పూర్తికాని పంపిణీపై ఆవేదన

ముస్తాబాద్, ఫిబ్రవరి 18 ( ప్రజా జ్యోతి ): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా



ప్రారంభించిన ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం పూర్తి కాకపోవడంతో మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది మంది మహిళలకు ఇప్పటికీ చీరలు అందలేదని బీఆర్ఎస్ నాయకురాలు కుర్ర సావిత్రి విమర్శించారు.
స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మొదట పల్లెల్లో చీరలు పంపిణీ చేస్తామని ప్రకటించినా, అనేక గ్రామాల్లో మహిళలకు అవి అందలేదని ఆమె పేర్కొన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా బతుకమ్మ చీరలను 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కార్యక్రమాన్ని నిలిపివేసిందని విమర్శించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఈసారి బతుకమ్మ చీరల స్థానంలో ఇందిరమ్మ మహిళా శక్తి పేరిట కొత్తగా కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా పంపిణీకి శ్రీకారం చుట్టారని చెప్పారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచడం, ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ పథకం లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, పంపిణీ సక్రమంగా అమలుకోవడం లేదు ఆధార్ మరియు ముఖ గుర్తింపు విధానంతో చీరల పంపిణీ చేపట్టినప్పటికీ, ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పంపిణీ అర్ధాంతరంగా నిలిపివేశారు.
ఇప్పటికైనా మిగిలిన మహిళలకు చీరలు అందించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి పంపిణీ పూర్తి చేయాలని ముస్తాబాద్ మండల మహిళలు కోరుతున్నారు.



# కార్మికులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్ ఫిబ్రవరి 19(ప్రజాజ్యోతి): ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ గురువారం రాజీవినగర్ లోని చేనేత పారిశ్రామిక సహకార సంఘంలో గ్రూప్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడుతూ ప్రస్తుత వేగవంతమైన జీవన శైలిలో కార్మికులు తమ పనిలో నిమగ్నమై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోందనీ ప్రముఖ సైకాలజిస్ట్ కె . పున్నచందర్ తెలిపారు. శారీరక శ్రమ, మానసిక ఒత్తిడి, అనారోగ్యకరపు ఆహార అలవాట్లు, సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు కార్మికుల్లో ఏర్పడుతున్నాయనీ అన్నారు. కార్మికులు తమ ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం అవసరమని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యం మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా సమానంగా ముఖ్యమని అన్నారు. నిరంతర ఒత్తిడి, ఆర్థిక భారం, కుటుంబ బాధ్యతలు వంటివి మానసిక సమస్యలకు దారితీసే అవకాశం ఉందనీ తెలిపారు. అలసట, నిద్రలేమి, చిరాకు, నిరుత్సాహం వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే నిపుణులను సంప్రదించాలి. కార్మికులు పాటించాల్సిన ముఖ్య సూచనలు చేశారు. సమతుల్య ఆహారం తీసుకోవడం రోజు కనీసం 7–8 గంటల నిద్రమద్యపానం, పొగ త్రాగడం వంటి అలవాట్లకు దూరంగా ఉండడం నిరంతర వైద్య పరీక్షలు చేయించుకోవడం యోగా, ధ్యానం వంటి పద్ధతులతో మానసిక ప్రశాంతత పెంపొందించుకోవాలని అన్నారు. పని సమయంలో భద్రతా నియమాలు పాటించడం యజమానులు కూడా తమ సంస్థల్లో ఆరోగ్య శిబిరాలు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించి కార్మికుల శారీరక–మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహకరించాలనీ అన్నారు. ఆరోగ్యవంతమైన కార్మికులు ఉంటేనే కుటుంబం, సంస్థ, సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందనీ తెలుపుతూ "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నినాదాన్ని గుర్తుంచుకుని ప్రతి కార్మికుడు తన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనీ అన్నారు. కమ్యూనిటీ ఫెసిలిటేటర్ వేముల మార్కండేయ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న థ్రిఫ్ట్ పథకం, నేతన్న బీమా, ప్రధానమంత్రి జీవిత సురక్ష బీమా, ప్రధానమంత్రి జీవన జ్యోతి లాంటి పథకాల్లో చేరి



వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఫెసిలిటేటర్ వేముల మార్కండేయ, హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అలువల ఈశ్వర్, అడ్వకేట్ దాసరి తిరుమల, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మేషం రాజయ్య, రవీందర్ కార్మికులు పాల్గొన్నారు.

## లింక్ కాలువ వద్దు చెరువులకే నీరు ఇవ్వాలి: రైతుల డిమాండ్

– చిన్న లింక్ కాలువతో భూముల నష్టం
– సీతారామ ప్రాజెక్టు పేరుతో రైతులపై మరో దెబ్బ



**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 19, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల నర్సాపురం (రాజపురం) గ్రామ రైతులు తమ భూములను కాపాడాలని కోరుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ కారణంగా భూములు కోల్పోయి ఇంకా కోలుకోకముందే, ఇప్పుడు మరోసారి చిన్న లింక్ కాలువ పేరుతో రైతులపై భారమేస్తున్నారని వారు వాపోయారు. మండల పరిధిలోని రాజపురం గ్రామంలో నర్సాపురం రెవెన్యూ పరిధి (11 ఆర్--ఆర్ యం--1)లో చిన్న లింక్ కాలువ ప్రతిపాదన రావడంతో, గ్రామ రైతులు అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణను ఆయన నివాసంలో కలిసి కాలువను నిలిపివేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గతంలో ప్రధాన కాలువ నిర్మాణంతో తమ భూములు నష్టపోయాయని, ఇప్పుడు ఉపయోగం లేని చిన్న లింక్ కాలువ కారణంగా నర్సాపురం రెవెన్యూ పరిధిలో సుమారు 18 ఎకరాల సాగుభూమి మళ్లీ కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కాలువ వరి పొలాల్లోకి వచ్చి మధ్యలోనే ఆగిపోతుండటంతో, ఎవరికీ ప్రయోజనం లేకుండా భూమి నష్టం మాత్రమే జరుగుతోందని వాపోయారు. ఈ రెవెన్యూ పరిధిలో రాముడు చెరువు, పెద్దమ్మ చెరువు అనే రెండు ప్రధాన చెరువులు ఉన్నాయని, వాటికి లింక్ కాలువ ద్వారా నీరు అందిస్తే రైతులకు మేలు జరుగుతుందని, ఎలాంటి భూ నష్టం జరగదని రైతులు సూచించారు. చిన్న లింక్ కాలువలో భూములు కోల్పోయే వారు అందరూ సన్నకారు రైతులేనని, ఇలా సాగితే రైతులు బజారున పడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున చిన్న లింక్ కాలువలను పూర్తిగా రద్దు చేసి, రెండు చెరువులకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, ఆత్మ కమిటీ సభ్యులు దుబాకుల రాము, బన్నె ఏసుబాబు, జగదీష్, కృష్ణారెడ్డి, అరుణ, కేశవరెడ్డి, రంగారెడ్డి, కంచు ప్రసాద్, కేశవులు, సంజీవరెడ్డి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి నిర్వహణ

– టిడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పూలదండలు, ఘన నివాళులు



**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 19,ప్రజా జ్యోతి:** చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద చత్రపతి శివాజీ పటానికి పూలదండ వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీకి ఘన నివాళులు అర్పించి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుంజ వెంకట్ మాట్లాడుతూ--- స్వరాజ్య స్థాపనకు నాంది పలికిన మహానాయకుడు చత్రపతి శివాజీ అని, ధైర్యం, క్రమశిక్షణ, న్యాయపాలనకు ఆయన ప్రతీకగా నిలిచారని అన్నారు. సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన ఆయన ఆదర్శాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. మతసామరస్యం, దేశభక్తి, ప్రజాపాలనలో నైతిక విలువలను శివాజీ తన జీవితం ద్వారా ఆచరించి చూపారని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిచితే సమాజం మరింత బలపడుతుందని అన్నారు. అనంతరం ఉపాధ్యక్షుడు రాఘవ, ప్రజా జ్యోతి రిపోర్టర్ బుజ్జి కృష్ణ, నవ భూమి రిపోర్టర్ సీతారాములు, ప్రజా దర్బార్ రిపోర్టర్ రమేష్, ప్రజావారధి రిపోర్టర్ శివ, స్ఫూర్తి రిపోర్టర్ సురేష్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు చత్రపతి శివాజీ అభిమానులు పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

## ఉపాధి కూలీల మధ్య ఘనంగా శివాజీ జయంతి

– శివాజీ ఆశయాల ప్రచారం
– హిందూ ధర్మ రక్షణ దళం ఆధ్వర్యంలో కార్యక్రమం



**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 19,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీల మధ్య శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. హిందూ ధర్మ రక్షణ దళం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దళ సభ్యులు చిల్లపల్లి వెంకటేశ్వర్లు, బాల కిరణ్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు. శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, పరాక్రమం, స్వరాజ్య స్థాపనలో ఆయన చూపిన పోరాటస్ఫూర్తి గురించి ఉపాధి కూలీలకు వివరించారు. విదేశీ ఆక్రమణలకు ఎదురొడ్డి హిందూ సంస్కృతి, ధర్మాన్ని కాపాడిన మహనీయుడు శివాజీ అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను యువతతో పాటు కార్మికులు కూడా ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, ధర్మరక్షణ పట్ల కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, సంస్కృతి పరిరక్షణ, స్వాభిమానాన్ని పెంపొందించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు నాగళ్ళకుమారి, నాగలక్ష్మి, పానుగంటి రాణి, మారగానే చిన్నమ్మ, వంగా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం

## ప్రజా పాలనకు లభించిన గౌరవం

– కాంగ్రెస్ నేతలు
– మున్సిపల్ చైర్ పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సామినేని సుజాత రామనాథం





**మధిర ప్రజా జ్యోతి** మధిర మున్సిపల్ చైర్ పర్సన్ గా సామినేని సుజాత రామనాథం,వైస్ చైర్మన్ గా కోనా ధని కుమార్,పాలకవర్గ సభ్యులు గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు,మధిర పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా కొలువుదీరిన నూతన పాలకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శాలువాలతొ సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ,ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. మధిర అభివృద్ధికి చైర్మన్,ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ప్రజా పాలనకు లభించిన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి,తెలుగుదేశం పార్టీ ఖమ్మం జిల్లా కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకటరమణ గుప్తా,బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చావా వేణు, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు, నిడమానూరు వంశీకృష్ణ, పారుపల్లి విజయ్,దుంప వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**21 వార్డుల్లో కాంగ్రెస్ కుటమి గెలుపు సంచలనం**

మధిర మున్సిపాలిటీలో 22 వార్డులకి ఈ నెల 11న జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి 21 స్థానాల్లో గెలుపొంది సంచలనం నమోదు చేసింది. కాగా ఈనెల 16న జరిగిన చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచనలతో పాలకవర్గ సభ్యులు చైర్మన్ గా సామినేని సుజాత రామనాథం, వైస్ చైర్మన్ గా కోన ధని కుమార్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోక అదే రోజు సుజాత-ధని కుమార్, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

## క్వార్టర్ల రెంట్ బకాయి వసూళ్లకు బాధ్యులేవరూ..!

- రూ. 1.59 కోట్లు పేరుకుపోయిన బకాయిలు
- కాంట్రాక్టు ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు!
- క్వార్టర్లను సంస్థకు అప్పగించిన వైనం
- ఏళ్ల తరబడి ఉన్న వారి రెంట్ ఎవరూ కట్టెనో!
- క్వార్టర్లను స్వాధీనం చేసుకున్న సమయంలో రెంట్ వసూల్ చేయరా
- నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు...!
- వారు ఆ క్వార్టర్లను కిరాయిలకు ఇచ్చిన వైనం - అనర్హత క్వార్టర్ల లెక్క తేల్చరూ..!
- క్వార్టర్ల కేటాయింపు వెనుక మతలబు ఏమిటో - అధికారులు జర దృష్టి సాధించరూ...!



**ఇల్లందు, ఫిబ్రవరి 19, ప్రజాజ్యోతి: సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్మికులకు సింగరేణి క్వార్టర్లను కేటాయించడం సర్వసాధారణం. కానీ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సైతం క్వార్టర్ల కేటాయింపు పలు అనుమానాలకు ఆజ్యం పోస్తుందని చెప్పొచ్చు. ఇలా ఇప్పుడు ముబ్బడిగా క్వార్టర్లను కేటాయించడం వల్ల రూ. కోట్లు రెంట్ ల రూపంలో బకాయిలు పేరుకుపోయి వసూలు కష్టతరమయ్యే పరిస్థితి నెలకొంది. అసలు కాంట్రాక్టు ఉ ద్యోగులకు ఏ ప్రాతిపదికన క్వార్టర్లను కేటాయించారో అర్థంకాని ప్రశ్నగానే మిగిలిపోయింది. ఇలా ఇష్టానుసారంగా క్వార్టర్ల కేటాయింపు వల్ల ఇల్లందు ఏరియాలో సుమారుగా రూ. 1.59 కోట్ల వరకు రెంట్ బకాయిలు పెరిగిపోయాయి. ఇప్పుడు ఆ రెంట్ బకాయిల వసూళ్లకు బాధ్యులేవరో తెలియాల్సి ఉంది.**

సంస్థలో పదుల సంఖ్యలో కాంట్రాక్టు ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించగా ఏళ్ల తరబడి ఉండి ఈ మధ్యకాలంలో ఒకరిద్దరు ఆ క్వార్టర్లను సంస్థకు అప్పగించినట్లు సమాచారం, అధికారులైన క్వార్టర్స్ ను స్వాధీనం చేసుకునే సమయంలో ఆ క్వార్టర్లకు సంబంధించిన రెంటు బకాయి ఎంత ఉందో అంత చెల్లించిన తర్వాతనే స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఎందుకు అంత నిర్లక్ష్యంగా వ్యవహరించారోనన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా ఒక నెల.. రెండు నెలలు రెంట్ చెల్లించకపోతే నోటీసులు ఇచ్చి అయినప్పటికీ స్పందించని పక్షంలో విద్యుత్, నీటి సరఫరా బందు చేసే అధికారులు ఏళ్ల తరబడి ఎందుకు పట్టించుకోలేదో అర్థం కాని పరిస్థితి. ప్రస్తుతం ఆ క్వార్టర్స్ అప్పగించడంతో వాటిపై ఉన్న రెంట్ బకాయిలు ఎవరు చెల్లిస్తారో తెలియాల్సి ఉంది. అసలు నిబంధనలను భేఖాతర్ చేస్తూ కాంట్రాక్ట్ ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించడమే కాకుండా రూ. లక్షల్లో రెంట్ బకాయిలను సైతం వదిలివేయడం వెనుక మర్మమేమిటని, ఎవరి ప్రయోజనాల కోసం ఇలా వ్యవహరిస్తున్నారని కార్మికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. అదికాక క్వార్టర్లలో వారైనా ఉన్నారా అంటే పొరపాటే.. దర్జాగా ఆ క్వార్టర్లను బయట వ్యక్తులకు కిరాయిలకు ఇస్తూ నెల నెల రెంట్ తీసుకోవడం జరుగుతుందనేది పక్కా సమాచారం. కానీ ఆ తీసుకున్న కిరాయిని సంస్థకు చెల్లించకుండా నిర్లక్ష్యంగా ఉన్నారనేది వాస్తవం. ఇలా ఇల్లందు ఏరియా వ్యాప్తంగా పదుల సంఖ్యలో అనర్హత క్వార్టర్స్ కు సంబంధించిన లెక్క తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరీ ముఖ్యంగా అనర్హులకు క్వార్టర్ల కేటాయింపు వెనుక మతలబు ఏమిటో అర్థంకాని పరిస్థితి, ఇలా సంస్థ నిబంధనలను తుంగలో తొక్కి కాంట్రాక్టు ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయింపు విషయంపై అధికారులు చొరవ చూపి సమగ్ర విచారణ జరిపితే మరెన్నో నిజాలు బహిర్గతం అవుతాయనేది వాస్తవం. సింగరేణి కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఒక సంవత్సరం కాల పరిమితితో సంస్థ క్వార్టర్ ను కేటాయించింది. ఆ సంవత్సర కాలపరిమితి పూర్తయిన తర్వాత ఆ క్వార్టర్స్ ను స్వాధీనం చేసుకోవాల్సింది పోయి అప్పటి అధికారులు సైతం కొంత నిర్లక్ష్యంగా వ్యవహరించారనేది స్పష్టమవుతుంది. సదరు కాంట్రాక్టు ఉద్యోగి సుమారుగా 8 ఏళ్లకు పైగా ఆ క్వార్టర్స్ ను వినియోగించుకున్నట్లు సమాచారం. సదరు కాంట్రాక్ట్ ఉద్యోగి కొంత సమయస్ఫూర్తితో ఆ క్వార్టర్స్ ను సంస్థకు అప్పగించడం జరిగింది. ఆ సమయంలోనైనా సంబంధిత అధికారులు కోటర్స్ కు సంబంధించిన బకాయిలు చెల్లించారా... పెండింగ్ లో ఉన్నాయని తెలిసి కూడా తెలియనట్లు వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ క్వార్టర్ ను సింగరేణి సంస్థకు అప్పగించి సంవత్సర కాలం పూర్తినప్పటికీ నేటి వరకు ఇలాంటి రెంటు బకాయిలు వసూలు చేసిన దాఖలాలు లేవని తెలుస్తుంది. ఇలా వ్యవహరించడం వల్లనే క్వార్టర్స్ రెంటు బకాయిలు భారీగా పేరుకుపోయాయని స్పష్టమవుతుంది. అంతేకాకుండా సింగరేణి క్వార్టర్లలో ఉండి వాటిని సంస్థకు అప్పగించిన వారు సైతం ప్రస్తుతం ఏదో ఒక విభాగంలో పని చేస్తూ ఉన్నందున వారెవరో తెలుసుకొని ఆయా క్వార్టర్ల పై పేరుకుపోయిన రెంట్ బకాయిలను వసూలు చేసేలా చూడాలని, లేనియెడల మరింత బకాయిలు పెరిగిపోయే ప్రమాదం లేకపోలేదని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

## హెమ్- పోస్టుల భర్తీ నిమిత్తం వ్రాత పరీక్ష, ప్రాక్టికల్ పరీక్ష









**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 19** సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఖాళీగా ఉన్న రెండు శాంప్లింగ్ మజ్దూర్ పోస్టుల ఇంటర్నల్ భర్తీ కోసం ఉద్యోగుల నుండి దరఖాస్తులను ఆహ్వానించగా 104 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవడం అయినది అందులో 92 మంది గురువారం నిర్వహిస్తున్న వ్రాత పరీక్షకు హాజరయ్యారు. అలాగే "03" డంప్ మెన్ / ట్రిప్ మెన్ పోస్టుల ఇంటర్నల్ భర్తీ కోసం ఉద్యోగుల నుండి దరఖాస్తులను ఆహ్వానించగా 10 మంది దరఖాస్తులు చేసుకున్నారు వారిలో ఈరోజు 09 మంది వ్రాత పరీక్షకు హాజరుకావడమైనది మరియు "09" జనరల్ అసిస్టెంట్ హెమ్- పోస్టుల ఇంటర్నల్ భర్తీ కోసం జనరల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల నుండి దరఖాస్తులను ఆహ్వానించగా 10 మంది దరఖాస్తులు చేసుకున్నారు వారిలో ముగ్గురు ప్రాక్టికల్ టెస్ట్ కు హాజరుకావడమైనది. ఈ పరీక్ష నిర్వహణ కార్యక్రమం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఆదేశానుసారం ఎస్ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డి పర్యవేక్షణలో ఏజిఎం (పర్సనల్) జీవి మోహన్ రావు ఆధ్వర్యంలో సంబంధిత విభాగాధిపతుల అధ్యక్షతన, జివిటిసి మేనేజర్ జి లక్ష్మణ్ సహకారంతో జివిటిసి, రుద్రంపూర్ నందు నిర్వహించుకోవడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డిగారు హాజరై ఈ వ్రాత పరీక్ష ఏర్పాటుచేసిన ఎగ్జామ్ పేపర్ ను ఎగ్జామ్ రాయడానికి వచ్చిన ఉద్యోగుల సమక్షంలో ఓపెన్ చేసి వారికి ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు నిర్వహిస్తున్న వ్రాత పరీక్ష మరియు ప్రాక్టికల్ టెస్ట్ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని ఉద్యోగులు ఎటువంటి ప్రలోభాలకు పోకుండా వారికిచ్చిన ఎగ్జామ్ పేపర్ ను కాపీ కొట్టకుండా రాయాలని అన్నారు. అలాగే జనరల్ అసిస్టెంట్ (హెమ్) ప్రాక్టికల్ టెస్ట్ కు వచ్చిన ఉద్యోగులకు బేస్ వర్క్ షాప్ వెంకటేష్ గని కోల్ మైన్స్ నందు డంపర్ వాహనం మరియు సంబంధిత హెవీ ఎర్త్ మూవింగ్ మిషనరీ లకు సంబంధించి రక్షణ తో కూడిన పని తీరు ఎలా చేయాలో అని వారికి ప్రాక్టికల్ టెస్ట్ లో ప్రశ్నలు అడిగారు. హెమ్ పనితీరు విధానాలపై ప్రశ్నలు అడిగి సరైన సమాధానాలు, హెమ్ పనికి తగిన ప్రావీణ్యం, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ పరీక్ష పూర్తి పారదర్శకంగా నిర్వహించినందుకు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ఈ పరీక్ష నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డి తో పాటు ఏరియా ఇంజనీర్ కే సూర్యనారాయణ రాజు, ఏజిఎం (పర్సనల్) జీవి. మోహన్ రావు, డిజిఎం( ఐఈడి) ఎన్ యోహాన్, వెంకటేశ్వర్లు, డివైఎస్ఈ ఏ ఉపేందర్ బాబు, జి.వి.టి.సి మేనేజర్ జి.లక్ష్మణ్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అండ్ ఇంచార్జ్ క్వాలిటీ డిపార్ట్మెంట్ యు అభిలాష్, జి.వి.టి.సి కార్యాలయ మరియు పర్సనల్ డిపార్ట్మెంట్ సిబ్బంది, రాత పరీక్ష , ప్రాక్టికల్ టెస్ట్ రాయడానికి వచ్చిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

– జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సబ్బయ్య, వేణు






**సత్తుపల్లి ఫిబ్రవరి19(ప్రజా జ్యోతి)** దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల సాధనలొ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పెన్షనర్ల తరపున నిలచి ఉంటుందని ఆ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుబ్బయ్య,వేణు అన్నారు. గురువారం సత్తుపల్లి లోని సంఘ కార్యాలయ భవనంలో యూనిట్ స్థాయిలో పెన్షనర్ల దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ హెల్త్ కార్డ్ ల విషయంలో ఉద్యోగులకు,పెన్షనర్లకు అనేక సందేహాలున్నాయనీ వాటన్నిటిని పరిష్కరించే విధంగా ప్రభుత్వంతో చర్చిస్తామని వారు అన్నారు. రిటైరైన వారికి రావలసిన బకాయిలు చాలా వరకు ఇంకా పెండింగ్ లోనె ఉన్నాయనీ, ఈ మార్చి మాసాంతం లోగా ప్రభుత్వం చర్యలు తీసుకోనట్లయితే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తుందని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంఘ అధ్యక్ష కార్యదర్శులు వెస్లీ,కోటేశ్వరరావులు మాట్లాడుతూ ఈ నెలలోనే రాష్ట్ర సంఘ ఎన్నికలు ఉన్నాయనీ,ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యే కొత్త కమిటీ ఉద్యమ కార్యాచరణ నిర్ణయం తీసుకునేలా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సంఘాలు కృషిచేస్తాయని హామీ ఇచ్చారు. పెన్షనర్స్ డే సందర్భంగా జరిగిన సమావేశంలో తొలుత కార్యదర్శి నివేదికను ఏయస్.ప్రకాశరావు, ఆర్థిక నివేదికను జి.కృష్ణయ్య ప్రవేశ పెట్టారు. సంతాప తీర్మానాలు బూరుగు దాసు,సాధారణంగా తీర్మానాలను డి.కృష్ణయ్య ప్రకటించారు. అనంతరం ఇటీవలి సంవత్సర కాలంలో ఉద్యోగ విరమణ చేసిన వివిధ శాఖల విశ్రాంత ఉద్యోగులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పంపిన శుభాకాంక్షల సందేశాన్ని అధ్యక్షుడు కేశవరెడ్డి చదివి వినిపించారు. సంఘానికి పది వేల రూపాయల విరాళాన్ని పెన్షనర్స్ డే సందర్భంగా అందచేసిన విశ్రాంత ఉపాధ్యాయిని భూలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చెంచిరెడ్డి,కృష్ణారెడ్డి, ఉపేంద్రరావు,సత్తుపల్లి యూనిట్ నాయకులు దాసు, నర్సయ్య ,సాంబశివరెడ్డి, రామిశెట్టి సుబ్బారావుఅద్దంకి వెంకటరత్నం, డి.కృష్ణయ్య, వాణి, కమల కుమారి,యోగానంద్, మహమూద్, సీతారామమ్మ, సరోజిని, బోయినపల్లి రవి (న్యాయవాది) తదితరులు పాల్గొన్నారు.

# వైరా పుర ప్రజా ప్రతినిధులు నేడు బాధ్యతలు స్వీకరణ..

## చైర్ పర్సన్ – ఉప చైర్మన్ ప్రతినిధుల పాలన అమల్లోకి..

ఖమ్మం వైరా, ఫిబ్రవరి 19 ప్రజా జ్యోతి:
వైరా మున్సిపాలిటీ పరిధిలోని గెలుపొందిన కౌన్సిలర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. పురపాలక చైర్ పర్సన్ గా డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ తమ విధులను నేటి నుంచి ప్రజలకు అందించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ హాజరవుతారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల కౌన్సిలర్ లతో పాటు చైర్



పర్సన్ డాక్టర్ కాప చంద్రకళ, ఉప చైర్మన్ కట్ల సంతోష్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. నేటి నుండి మున్సిపాలిటీలో ప్రజా పాలన కొనసాగనుంది. గత ఎనిమిది నెలలుగా అధికారుల పాలనలో ఉన్న మున్సిపాలిటీ, నేటి నుండి ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల ద్వారా పాలన జరగనుంది.ఈ కార్యక్రమంలో తాజా, మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచులు నాయకులు, కార్యకర్తలు, పుర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.

# వచ్చే మేలో పార్టీని ప్రకటిస్తా

మొదటిపేజీ తరువాయి..

వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి తామే వస్తామని, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తోందని, కొత్త తరహా రాజకీయం చేయడం లేదని విమర్శించారు. తన పార్టీ వ్యక్తుల మీద కాకుండా వ్యవస్థల మీద నడవాలన్నారు. ప్రాంతీయ పార్టీలు లీడర్ సెంట్రిక్‌గా ఉంటాయని.. కానీ వ్యవస్థ



నిర్మాణం జరగాలని,సైద్ధాంతిక పునాది ఉండాలని అన్నారు. మహిళలను అవమానించవద్దన్నారు కవిత. వైఎస్ షర్మిలా రెడ్డి నేడు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారని.. కానీ, షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ప్రజలకు నచ్చలేదని తెలిపారు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా అని ప్రశ్నించారు. 'నా లైన్‌లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది' అని అన్నారు. తెలంగాణ వాదమే తమ పార్టీ మొదటి లైన్ అని తేల్చిచెప్పారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చినవారు కేంద్ర మంత్రులు అయ్యారని చెప్పుకొచ్చారు. కొత్త తరానికి తాను పెట్టబోయే పార్టీలో అవకాశాలు ఉంటాయని కవిత పేర్కొన్నారు.

# జాతిపిత గాంధీతో కెసిఆర్‌కు పోలికా

**జాతిపిత అని చెప్పకోవడానికి సిగ్గుండాలి**
**ప్రజల సమస్యలపై ఎందుకు మాట్లాడరు..**
**ఎందుకు అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేస్తారు**
**కెసిఆర్ జాతిపిత ప్రకటనపై మండిపడ్డ కడియం శ్రీహరి**

జనగామ,ఫిబ్రవరి19(ప్రజాజ్యోతి):
తెలంగాణ రాజకీయాల్లో 'జాతిపిత' అనే పదం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. బీఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఆయన పార్టీ నేతలు 'తెలంగాణ జాతిపిత'గా అభివర్ణించడాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రంగా తప్పుబట్టారు. భారతదేశానికి జాతిపిత ఒక్కరేనని, ఆయన మహాత్మా గాంధీ అని.. అలాంటి మహనీయుడితో కెసిఆర్‌ను పోల్చడం గాంధీజీని అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. అసలు కెసిఆర్‌కు జాతిపిత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ఆయన అత్యంత ఘాటుగా విమర్శించారు.నిజంగానే కెసిఆర్ జాతిపిత అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఎందుకు స్పందించడం లేదని కడియం శ్రీహరి ప్రశ్నించారు. ప్రజల కోసం పోరాడాల్సిన ప్రతిపక్ష నేత, అసెంబ్లీ సమావేశాలకు రాకుండా ఎక్కడ ఉన్నారని ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎందుకు నిలదీయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం సెంటిమెంట్‌ను వాడుకుని రాజకీయాలు చేయడం తప్ప, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్యకు వచ్చి వారి కష్టాలను తీర్చే ఉద్దేశం కెసిఆర్‌కు లేదని ఎద్దేవా చేశారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కల్వకుంట్ల కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారని కడియం ఆరోపించారు. అందుకే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించి, ఓటు వేయడానికి ఇష్టపడలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులను కూలిపోయేలా నిర్మించడమే కాకుండా, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి దివాళా తీయించారు. ఎన్నో స్కామ్‌లలో ఇరుక్కున్న నేతను జాతిపిత అని ఎలా పిలుస్తారని ఆయన నిప్పులు చెరిగారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాలేదని కడియం దుయ్యబట్టారు. వారి అహంకారం, అహంభావం వల్లే ప్రజలు వారికి దూరమయ్యారని, ఇప్పటికైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొన్నారని, ఇది ఎవరి సొత్తు కాదని గుర్తు చేశారు. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి ప్రవర్తించకపోతే భవిష్యత్తులో ప్రజలు మరింత గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

# 26 నుంచి తెలంగాణ.. బడ్జెట్ సమావేశాలు

మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ రూపకల్పనపై సర్కార్ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా ప్రీ బ్జడెట్ సమావేశాలను పూర్తి చేశారు. అన్ని శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. ఈసారి బ్జడెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. రైతు సంక్షేమం, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి వంటి ఆరు గ్యారంటీల అమలుకు భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉంది. కొత్త సంక్షేమ పథకాలు, నీటిపారుదల, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి వంటి అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో పెన్షన్ల విషయంలో కీలక నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఇక, ఈనెల 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్‌లో బ్జడెట్ సమావేశాలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. 2025-26 ఆర్థిక



సంవత్సరానికి రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆ బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆర్థిక మంత్రి భట్టి తెలిపారు. ఆరు గ్యారంటీలకు సుమారు రూ.56,084 కోట్లను కేటాయించారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా వెల్లడించారు. రాష్ట్రం రుణాలు రూ.5,04,814 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. శాసనసభలో బడ్జెట్‌పై భట్టి విక్రమార్క 1.43 గంటల పాటు ప్రసంగించిన సంగతి తెలిసిందే.గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిరంతరం పనిచేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ప్రజలకు నిజాలు చెప్పకపోతే స్వార్థపరులు చెప్పేవే నిజమని అనుకుంటారని, మార్పు తెచ్చేలా బాధ్యతాయుత పాలన అందిస్తామని తెలిపారు.ఈ ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ఎన్నికల సమయంలో విస్తృతంగా ప్రచారం చేయడంతో అధికారంలోకి వచ్చింది. మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్‌గా ప్రస్తుతం ఐటీ శాఖ మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు వ్యవహారించారు. ఈసారి బడ్జెట్ సమావేశాల్లో ఆరు గ్యారెంటీల ప్రస్తావన కూడా ప్రతిపక్ష ఎమ్మెల్యేల నుంచి రానున్నట్లు సమాచారం.

# కర్రెగుట్టలో భారీ ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి..

బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. దీంతో అక్కడే ఉన్న మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. మరోవైపు దేశం నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తి స్థాయిలో తుడిచి పెట్టాలనే కేంద్ర ప్రభుత్వ మిషన్ - 2026 గడువు సమీపిస్తున్న వేళ తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో వాతావరణం వేడెక్కింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు అత్యంత వ్యూహాత్మకమైన ఆపరేషన్ కగార్‌ను పునఃప్రారంభించాయి. ఈసారి కర్రె గుట్టల హిల్స్‌ను టార్గెట్ చేసుకున్నట్టు సమాచారం. అందుకే దీనికి ఆపరేషన్ కేజీహెచ్-2ను ప్రారంభించాయి. ఒకవైపు సరిహద్దుల్లో రెండు వేల మంది సాయుధ బలగాల మోహరించారు. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అటవీప్రాంతాల్లో అగ్రనేత బడే చొక్కారావు, అలియాస్ దామోదర్‌తోపాటు బడానేతలు సంచరిస్తున్నారనే సమాచారరంతో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ సంఖ్యలో బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న మార్చి 31 గడువు దగ్గర పడుతోంది. కేవలం ఇంకో నలభై రోజులు మాత్రమే మిగిలి ఉంది. అందుకే ఈలోపు ఉన్న మావోయిస్టులను తుదముట్టించాలని ప్రభుత్వం ఆపరేషన్‌ను తీవ్రం చేసింది. సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ కేజీహెచ్-2 చేపడుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నంబి ప్రాంతం నుంచి వ్యాపించి ఉన్న కర్రెగుట్టల అడవుల్లో ఈ వేట కొనసాగిస్తున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జి అలియాస్ చేతన్, జూనియర్ క్యాడర్‌కు చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జి కేసా సోఢీ, బడే చొక్కారావులాంటి పెద్ద తలకాయలను పట్టుకోవడమే లక్ష్యంగా రెండు వేలకుపైగా బలగాలతో అడవిలో అణువణువూ గాలింపు చర్యలు చేపట్టారు. గతేడాది ఏప్రిల్‌లలో ఇదే ర్రెగుట్టల్లో నిర్వహించిన 21రోజుల సుదీర్ఘ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులను హతమార్చారు. కానీ అగ్రనేతలు మాత్రం తప్పించుకున్నారు. ఈసారి వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టకూడదనే పట్టుదలతో బలగాలు ఉన్నాయి. ప్రస్తుతానికి తడపల, పామునూరు, మురుమూరు, డోలి వంటి ప్రాంతాల్లో నిరంతర నిఘా పెట్టార. తెలంగాణలోని ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దుల్లో బడే చొక్కారావు అలియాస్ దామోదర్ షెల్టర్ తీసుకున్నారని పక్కా సమాచారం అందింది. అందుకే ఈ ప్రాంతాల్లో కూడా హై అలర్ట్ ప్రకటించారు. దామోదర్ స్వస్థలమైన తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఆ గ్రామం నుంచి కీలక సమాచారం బయటకు వెళుతుందని అనుమానంతో నిఘా విభాగం, గ్రేహౌండ్స్ దళాలు అప్రమత్తమయ్యాయి. పెద్దాపూర్, కొప్పుగుట్ట, గండికామారం వంటి ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని అత్యంత శక్తిమంతమైన నిఘా విభాగం, గ్రేహౌండ్స్ దళాలు ఈ ఆపరేషన్‌లో భాగస్వామ్యం అయ్యాయి. ముత్తారం మండలంలోని సర్వాయిపేట అడవుల నుంచి ఇతర ప్రాంతాల వరకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# ఎప్రిల్ నుంచి పలు రాష్ట్రాల్లో ఎన్నికల సవరణ

మొదటిపేజీ తరువాయి..

పక్కాగా రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు పలు రాష్ట్రాలప్రధాన ఎన్నికల అధికారులకు అత్యవసరంగా లేఖలు రాసింది. ఏప్రిల్ నుంచి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ పక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదును అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మొత్తం 20కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. వాటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ / కాశ్మీర్, లడఖ్, కర్ణాటక, ఒడిశా, జార్ఖండ్, సిక్కిం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ ఉన్నాయి. సర్ కార్యక్రమానికి సంబంధించి సన్నాహక పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఆయా రాష్ట్రాల అధికారులు చర్యలు చేపట్టాలని సూచించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో అధికారులు వీలైనంత త్వరగా సన్నాహకాలను పూర్తి చేసి, ఏప్రిల్ 2026 నుంచి ప్రారంభమయ్యే ఘ్రాంఖీని సజావుగా జరిగేలా చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం దిశానిర్దేశం చేసింది.



# హైదరాబాద్‌లో 'లష్కరే తోయిబా' పేలుళ్లకు యత్నం

మొదటిపేజీ తరువాయి..

లష్కరే తోయిబా ఉగ్రవాది జాహెద్, మరో కుట్రకు ప్రయత్నిస్తున్నట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఆ విషయాన్ని నిర్ధారించుకునేందుకు నిఘా వర్గాల బృందం ఈ నెల 17న హైదరాబాద్ నగరానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న జాహెద్, పాకిస్థాన్‌లోని సహచరులతో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు ఇంటెలిజెన్స్ అనుమానిస్తోంది.దసరా పండుగ రోజు హైదరాబాద్‌లో వరుస పేలుళ్లకు ప్రణాళిక చేసి విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. 2022 అక్టోబరు 2న మూసారాంబాగ్‌కు చెందిన అబ్దుల్ జాహెద్ అలియాస్ మోటు, అక్బర్‌బాగ్‌కు చెందిన మహ్మద్ సమీయుద్దీన్ అలియాస్ అబ్దుల్ సమి, మాజ్ హసన్ ఫరూక్ అలియాస్ మాజ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. జాహెద్ నుంచి 2 హ్యాండ్ గ్రనేడ్స్, 3 లక్షల 91 వేల 800 నగదు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.సమీయుద్దీన్ నుంచి హ్యాండ్ గ్రనేడ్, రూ.లక్షన్నర నగదు, మొబైల్ ఫోన్, ఒక బైక్, మాజ్‌హసన్ నుంచి గ్రనేడ్, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పండుగ సమయాల్లో పాత నేరస్థులు, సోషల్ మీడియాలో నిఘా ఉంచిన పోలీసులు మాజిద్ బృందం కుట్రను పసిగట్టారు. అక్టోబరు 2 తెల్లవారుజామున మూసారాంబాగ్, చంపాపేట్, మలక్‌పేట్ తదితర ప్రాంతాల్లోని పలు నివాసాల్లో పోలీసులు మెరుపు సోదాలు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు.పాకిస్థాన్‌లో తలదాచుకున్న ఉగ్రవాది ఫర్హతుల్లా గోరీ, అబు అంజాలా, జాహెద్ సోదరుడైన మజీద్ ఆదేశాలతో హైదరాబాద్ నగరంలో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు నిఘావర్గాలు తీవ్రంగా అనుమానిస్తున్నాయి. ఇందుకు అవసరమైన నియామకాలు కూడా చేపట్టారని, అవసరమైన ఆర్థిక సాయం పాకిస్థాన్ నుంచి అందినట్లు అప్పట్లోనే జాహెద్ పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా అంగీకరించాడు. హవాలా మార్గంలో రూ.33 లక్షలు అందగా, ఫరతుల్లా ఘోరీ 4 గ్రనేడ్లు పంపినట్లు చెప్పాడు.ఆ గ్రనేడ్లు తొలుత కశ్మీర్, ఆ తర్వాత అక్కడి నుంచి మహారాష్ట్రలోని మనోహరాబాద్‌కు రాగా, 2022 సెప్టెంబర్ 28న సమీయుద్దీన్ అనే యువకుడు తన వాహనంపై వెళ్లి హైదరాబాద్ తెచ్చి జాహెద్‌కు అప్పగించాడు. వాటిలో ఒకటి సమీయుద్దీన్, మరొకటి మాజ్‌కు ఇచ్చి జాహెద్ 2 గ్రనేడ్లను తన దగ్గర పెట్టుకున్నాడు. చివరి నిమిషంలో పోలీసులకు పట్టుబడగా, వారి కుట్రకు బ్రేక్ పడింది. అరెస్టయిన ముగ్గురిలో జాహెద్ చంచల్‌గూడ జైలు, మిగిలిన ఇద్దరిని శివారు ప్రాంతంలోని చర్లపల్లి జైలుకు తరలించారు.చంచల్‌గూడ జైలులో ఉన్న జాహెద్ ఈ మధ్య తరచుగా పాకిస్థాన్‌లోని తన సోదరుడైన మాజీద్‌తో మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించినట్లు విశ్వసనీయ సమాచారం. తొలుత పాకిస్థాన్‌కు ఫోన్ కాల్స్ వెళుతున్నట్లు గుర్తించిన అధికారులు, వాటిని మాజీద్ మాట్లాడుతున్నట్లు నిర్ధారణకు వచ్చారు. తదుపరి దర్యాప్తు కోసం ముగ్గురు సభ్యుల బృందం హైదరాబాద్ వచ్చి చంచల్‌గూడ జైలుకు వెళ్లి విచారణ చేసినట్లు తెలుస్తోంది.






Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967